RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 26 | మంగళవారం 02 - 09 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

### తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే

# మన ప్రతిష్ట పెరుగుతుంది

- ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని కోరిన ముఖ్యమంత్రి
- ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట ఢిల్లీ స్థాయిలో పెరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు
- జాతీయ స్థాయిలో తెలుగు ప్రజల ఉనికి ప్రమాదంలో పడింది
- ఇండీ కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గౌరవించి ఎన్నికల బరిలో నిలిచారని, సుదర్శన్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో ఎన్‌డీఏ కూటమికి బలమైన సవాల్ విసిరామని స్పష్టం చేశారు
- తెలుగు వ్యక్తి రాజ్యాంగ నిపుణుడికి ఒక అవకాశం వచ్చింది
- తెలుగు వారి గౌరవం, ప్రతిష్ట పెంపొందించేందుకు అభ్యర్థిని నిలిపామని, రాజకీయాలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అండగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు




జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట ఢిల్లీ స్థాయిలో పెరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇండీ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డితో రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమికి బలమైన సవాల్ విసిరాం : జాతీయ స్థాయిలో తెలుగు ప్రజల ఉనికి ప్రమాదంలో పడిందని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇండీ కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గౌరవించి ఎన్నికల బరిలో నిలిచారని, సుదర్శన్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో ఎన్‌డీఏ కూటమికి బలమైన సవాల్ విసిరామని స్పష్టం చేశారు. ధన్‌ఖడ్ రాజీనామా అందరికీ ఆశ్చర్యం కలిగించింది : రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఎన్‌డీఏ కూటమి

- మిగతా 2 లో

### హరీశ్ రావు, సంతోష్

# నాపై కుట్రలు చేశారు

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన ఆరోపణలు చేశారు
- మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ వారిద్దరు తనపై ఎన్నో కుట్రలు చేశారన్న కవిత
- తాను నోరు మెదపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు
- రేవంత్‌తో వారికి లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపణ
- కేసీఆర్‌కు అంటిన మరక వెనుక హరీశ్ రావు లేరా అని ప్రశ్న
- కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయిందని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ తనపై ఎన్నో కుట్రలు చేశారని, అయినప్పటికీ తాను నోరు మెదపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్ రావు, సంతోష్ వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు. వారి మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆమె అన్నారు. అందుకే రేవంత్ రెడ్డి వారిద్దరిని ఏమీ అనడం లేదని


## ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

- వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- తెలంగాణ, ఏపీలలోని పలు జిల్లాల్లో వర్షాలు
- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం
- వాయవ్య బంగాళాఖాతంలో రానున్న 12 గంటలల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం వాతావరణ కేంద్రం తెలిపింది




## భారత్‌పై అమెరికా ప్రశంసలు... వ్యూహాత్మక ఎత్తుగడా?

- మోదీ-పుతిన్ భేటీకి ముందు అమెరికా ప్రశంసలు
- ఎస్‌సీవో సదస్సులో మోదీ-పుతిన్ కీలక భేటీ
- సమావేశానికి ముందు స్వరం మార్చిన అమెరికా
- భారత్-అమెరికా బంధంపై విదేశాంగ మంత్రి రూబియో ప్రశంసలు
- కొన్ని గంటల ముందే భారత్‌పై ట్రంప్ సలహాదారు విమర్శలు
- రూబియో ప్రశంసలు నష్ట నివారణ చర్యల్లో భాగమేనంటున్న విశ్లేషకులు



షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో) వేదికగా ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల ద్వైపాక్షిక

- మిగతా 2 లో

## ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ భూప్రకంపనలు

- 622కు చేరిన మృతుల సంఖ్య..
- రిక్టార్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 6.3గా నమోదైంది
- ఆఫ్ఘనిస్తాన్ హోమ్ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం మృతుల సంఖ్య 622కు చేరినట్లు రాయిటర్స్ పేర్కొంది
- మరో 400 మంది తీవ్రంగా గాయపడ్డారు
- గాయపడ్డవారితో అక్కడి ఆస్పత్రులు నిండిపోయాయి
- ఆఫ్ఘనిస్తాన్‌లో వచ్చిన భూ ప్రకంపనల ధాటికి పాకిస్తాన్‌తోపాటు ఉత్తర భారతదేశంలోనూ ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో ప్రకంపనలు





## దివ్యాంగుల పెన్షన్ ను రూ.15 వేలు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే

- రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
- తెనాలిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేసిన మంత్రి నాదెండ్ల
- మొత్తం 63.61 లక్షల మందికి రూ. 2746 కోట్లు విడుదల
- పారదర్శకత కోసమే ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తున్నామన్న మంత్రి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పేరిట పెన్షన్ల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. సెప్టెంబర్ నెల కోటా కింద రాష్ట్రవ్యాప్తంగా 63,61,380 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ. 2,746.52 కోట్లను విడుదల చేసింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంత్రి నాదెండ్ల మనోహర్, గుంటూరు జిల్లా

- మిగతా 2 లో




# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ వైఎస్సార్సీపీకి చంద్రబాబు సవాల్
- అన్నమయ్య జిల్లాలోని మునక్కాయలవారిపల్లెలో పర్యటించిన సీఎం చంద్రబాబు, పింఛన్లు పంపిణీ
- పింఛన్లు పంపిణీ అనంతరం బోయనపల్లి ప్రజావేదిక సభలో ప్రజలతో ముఖాముఖి
- రాజకీయ జీవితంలో తాను ఏనాడూ విశ్రాంతి తీసుకోలేదని సీఎం చంద్రబాబు అన్నారు
- పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలనేదే తన ఆశయమని తెలిపారు
- దోబీ ఘాట్‌లో రజకులను పలకరించి ప్రభుత్వం నెలా నెలా అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు
- రాయలసీమ ఇకనుంచి రాళ్ల సీమ కాదని రతనాల సీమ అంటూ చెప్పారు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మళ్లీ స్వేచ్ఛ వచ్చిందని అన్నారు
- వైఎస్సార్సీపీ నేతలు మొన్నటివరకు సిద్ధం అని ఎగిరిపడ్డారు కానీ అసెంబ్లీకి వచ్చేందుకు సిద్ధమా?

రాజకీయ జీవితంలో తాను ఏనాడూ విశ్రాంతి తీసుకోలేదని సీఎం చంద్రబాబు అన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలనేదే తన ఆశయమని తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండలం మునక్కాయలవారిపల్లెలో పర్యటించిన సీఎం పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా దివ్యాంగురాలైన సుమిత్రమ్మకు సీఎం స్వయంగా పింఛన్ నగదు అందజేశారు. అనంతరం బోయినపల్లిలోని దోబీ ఘాట్‌లో రజకులను పలకరించి ప్రభుత్వం నెలా నెలా అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు. ఆ తర్వాత వారిని ఇబ్బందులు ఉన్నాయా అడగగా షెడ్లు కావాలని, అలానే దుస్తులు ఆరేసుకునేలా సౌకర్యాలు కల్పించాలని రజకులు కోరారు. వెంటనే అక్కడ షెడ్లు నిర్మించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమం అనంతరం బోయనపల్లి ప్రజావేదిక సభలో సీఎం పాల్గొని ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎవరైనా పింఛను తీసుకోకున్నా వచ్చే నెల అందిస్తున్నామని పేదల జీవితాల్లో వెలుగులు రావాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేస్తేనే మార్పులు

- మిగతా 2 లో

## ఏపీలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్




- బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం
- ఏపీలో రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- ఉత్తరాంధ్రలోని నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- మరో 8 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వానల సూచన
- సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరిక
- అల్పపీడనంపై ఐఎండీ అప్‌డేట్
- అల్పపీడనంపై ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి ఉందని ఐఎండీ వెల్లడించింది

# సంపాదకీయం

## మలిదశ విధ్వంసం




గాజా యుద్ధంలో ఇజ్రాయెల్ దుర్మార్గాలను బాహ్యాప్రపంచానికి తెలియచేస్తున్న పాత్రికేయులమీద నెతన్యాహూ కక్ష కట్టారన్న విషయం తెలిసిందే. జర్నలిస్టులని తెలియక చంపేశామనో, ఐడీఎఫ్ బలగాలు పొరబడ్డాయనో, వారు జర్నలిస్టు ముసుగులో ఉన్న టెర్రరిస్టులనో వాదిస్తూ ఆయన రెండువందలమంది జర్నలిస్టులను హత్యచేశాడు. ఇప్పుడు గాజానగరాన్ని పూర్తిగా దురాక్రమించి, ఆకలిచావులను కూడా దాటిబతికిన మిగతా పాలస్తీనియన్లను తుడిచిపెట్టేసే సరికొత్త కార్యక్రమానికి ఇజ్రాయెల్ అధినేత సంసిద్ధమవుతున్న తరుణంలో, మొన్న సోమవారం ఐదుగురు జర్నలిస్టుల దారుణ హత్య పాత్రికేయ ప్రపంచానికి మరో బలమైన హెచ్చరిక. అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ 'డబుల్ టాప్' విధానంలో ఈ హత్య జరిగింది. గాజాలోని నాసర్ ఆస్పత్రి కేంద్రంగా రాయ్‌టర్స్ సహా వివిధ వార్తాసంస్థలు యుద్ధాన్ని ఎంతోకాలంగా కవర్ చేస్తున్నాయని ఇజ్రాయెల్ బలగాలకు తెలుసు. అది రహస్యప్రదేశమేమీ కాదు. ఈ భవనంలోని పై అంతస్తుల్లో ఉంటున్న పాత్రికేయులను ఇజ్రాయెల్ బలగాలు గతంలో సంప్రదించిన సందర్భాలూ ఉన్నాయి. అవసరమైతే కెమెరాలతోనూ, డ్రోన్లతోనూ వీరంతా ఏం చేస్తున్నారో సులువుగా తెలుసుకోవచ్చు. కానీ, తమ వృత్తిధర్మాన్ని నిర్వహిస్తున్న పాత్రికేయులను ఇజ్రాయెల్ వేటాడింది. ఆస్పత్రి భవనంలో వైద్యుల నివాసాలున్న పై అంతస్తును ఐడిఎఫ్ బలగాలు మొదటగా పేల్చివేశాయి. ఆ దాడిలో గాయపడినవారిని కాపాడేందుకు కొందరు కొద్దిక్షణాల తరువాత పరుగులు తీశారు. వారితో పాటు ఈ ఐదుగురు పాత్రికేయులు కూడా మెట్లమీదనుంచి వెడుతూండగా, సరిగ్గా లెక్కలేసుకొని మరీ ఐడీఎఫ్ బలగాలు రెండో దాడిచేశాయి. ఏడునిముషాల తేడాలో ఉద్దేశపూర్వకంగా ఈ రెండుదాడులూ జరిగినట్టు ఒక అరబ్ చానెల్ ప్రత్యక్షప్రసారంలో స్పష్టంగా తేలిపోయింది. తొలిదాడిలో ముగ్గురు మరణిస్తే, మలిదాడిలో జర్నలిస్టులతో సహా 20మంది కన్నుమూశారు, వందమంది గాయపడ్డారు. ఐడీఎఫ్ బలగాల కదలికలను పసిగట్టడానికి ఈ భవనంపైన ఒక కెమెరా పెట్టారని, అందుకే ఈ దాడిచేశామని ఇజ్రాయెల్ దబాయిస్తోంది. అది ప్రత్యక్షప్రసారాలు ఇవ్వడానికి ఎప్పటినుంచో ఉన్నది తప్ప, నిఘా కెమెరా కాదని మీడియా సంస్థలు అంటున్నాయి. పొరపాటుకు ఏమాత్రం ఆస్కారంలేని ప్రదేశంలో ఈ దాడి జరిగినందున, ఇజ్రాయెల్ ఎన్ని చెప్పినా, ఐదుగురు పాత్రికేయులను అది ఉద్దేశపూర్వకంగానే అంతం చేసిందని మీడియా నమ్ముతోంది. గాజాదురాక్రమణలో భాగంగా ఇజ్రాయెల్ దళాలు యుద్ధట్యాంకులతో మిగిలిన నిర్మాణాలను కూల్చివేస్తున్నాయని, తీవ్రంగా గాయపడిన పాలస్తీనియన్లను తరుముతున్నాయని వార్తలు వస్తున్నాయి. పాలస్తీనియన్లు కూలిన ఇళ్ళను పట్టుకొని వేలాడుతున్నారు, గాయపడుతున్నారు, చస్తున్నారు తప్ప, స్వస్థలాన్ని వదిలిపోవడం లేదు. వీరందరినీ ఆకలితోనూ, ఆయుధంతోనూ హతమార్చి గాజాను హస్తగతం చేసుకోవాలనుకుంటున్న నెతన్యాహూ ఈ మలివిడత దాడిలో మరింత హింసాకాండకు ఒడిగట్టబోతున్నారన్నది వాస్తవం. గాజా దుర్భిక్షంతో అల్లాడుతున్నదని ఇప్పుడు అధికారికంగా కూడా నిర్ధారణ అయింది. ఆకలిచావులవార్తలు ఎంతోకాలంగా ప్రపంచం వింటోంది. ఆహారసరఫరాలు నామమాత్రంగా సాగుతూంటే, ఆ ట్రక్కులవెంట పరుగులు తీస్తున్నవారినీ, అన్నంకోసం గుమిగూడుతున్నవారినీ ఇజ్రాయెల్ దళాలు కాల్చిపారేస్తున్నాయి. గాజా వెలుపల వేలాది ట్రక్కులు అనుమతికోసం నిరీక్షిస్తుంటే, అర్థంలేని ఆంక్షలతో, నిషేధాలతో ఆహారం, ఔషధాలు గాజాలోకి రాకుండా ఇజ్రాయెల్ అడ్డుకుంటోంది. ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లో, ఇప్పుడు నగరాలకు దిగ్బంధం చేసి, వాటిని యుద్ధక్షేత్రాలుగా ప్రకటించి, ఆ కాస్త ఆహారాన్ని కూడా లోనకుపోనివ్వకుండా తన మలిదశ గాజా విధ్వంసాన్ని ఇజ్రాయెల్ అమలు చేయబోతోంది. పాత్రికేయుల ఊచకోత ఘటన అమెరికా అధ్యక్షుడిని కదిలించిందనీ, ఆయన యుద్ధాన్ని త్వరలోనే ముగించేందుకు కృషిచేస్తున్నారని కొన్ని కథనాలు వెంటనే ప్రచారంలోకి వచ్చాయి. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్ వంటివారిని వెంటేసుకొని ట్రంప్ ఏదో హడావుడి చేస్తున్నారు. కానీ, గాజాను అద్భుతమైన రిసార్టుగా చూడాలన్న కోరిక నెరవేర్చడానికి శ్రమిస్తున్న నెతన్యాహూను ఇప్పట్లో ట్రంప్ వారించే అవకాశాలు లేవు. గాజా తో పోల్చితే విధ్వంసంలోనూ, మానవహననంలోనూ ఆవగింజంతలేని ఉక్రెయిన్ యుద్ధం మాత్రం ఆయనకు అతి తీవ్రంగా, దుర్మార్గమైనదిగా కనిపిస్తోంది, దానిని వెంటనే ఆపి, నోబెల్‌శాంతి కొట్టేయాలనీ అనిపిస్తోంది.

## ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు


**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే రెండు రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.వాయవ్య బంగాళాఖాతంలో రానున్న 12 గంటల నుంచి 36 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## భారత్‌పై అమెరికా ప్రశంసలు... వ్యూహాత్మక ఎత్తుగడా?



**మొదటిపేజీ తరువాయి** – సమావేశానికి కొద్ది నిమిషాల ముందు, భారత్ పట్ల అమెరికా తన వైఖరిని మార్చుకుంది. ఇప్పటివరకు భారత్‌పై విమర్శలు గుప్పించిన ట్రంప్ యంత్రాంగం నుంచి అనూహ్యంగా ప్రశంసలు వెల్లువెత్తడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయా ంశమైంది.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వ్యాపారం, రక్షణ, సృజనాత్మకత వంటి అనేక రంగాల్లో సహకారం అద్భుతంగా ముందుకు సాగుతోందని ఆయన కొనియాడారు. "21వ శతాబ్దంలో భారత్-అమెరికా సంబంధాలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయి. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న స్నేహమే మా బంధానికి పునాది" అని రూబియో తన పోస్టులో వివరించారు.అయితే, రూబియో ఈ ప్రశంసలు గుప్పించడానికి కొన్ని గంటల ముందే ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో నుంచి భారత్‌పై తీవ్రమైన ఆరోపణలు రావడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కారణమంటూ ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం నుంచి భిన్న స్వరాలు వినిపించడం గందరగోళానికి తావిచ్చింది.మరోవైపు, ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు చట్టవిరుద్ధమంటూ అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తాజాగా తీర్పు ఇవ్వడం కూడా ట్రంప్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో, నష్ట నివారణ చర్యల్లో భాగంగానే రూబియో ఈ ప్రకటన చేసి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎస్‌సీవో వేదికపై భారత్, రష్యా, చైనా వంటి దేశాలు ఒకే చోట చేరడం కూడా అమెరికా వ్యూహాత్మక మార్పునకు కారణమై ఉండొచ్చని వారు భావిస్తున్నారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?





**మొదటిపేజీ తరువాయి** – వస్తాయని అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాయలసీమ ఇకనుంచి రాళ్ల సీమ కాదని రతనాల సీమ అంటూ చెప్పారు. అప్పులు చేసిన ఏ కుటుంబం కూడా బాగుపడదని, ఆదాయం పెంచుకున్నప్పుడే జీవితాల్లో మార్పు వస్తుందని సీఎం అన్నారు.అదే మీకు చివరిరోజు: రాష్ట్ర విభజన తర్వాత మనకు అనేక కష్టాలు వచ్చాయని కానీ 2014-19 మధ్య దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధిని చేసి చూపించామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మళ్లీ స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. దేశాభివృద్ధికి ప్రధాని మోదీ అనేక సంస్కరణలు తెస్తున్నారని, అలానే దేశాభివృద్ధిలో మన రాష్ట్రం కీలకపాత్ర పోషించాలని సూచించారు. గత పాలకులు అధికారాన్ని స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారని కానీ తమ పార్టీ ఎప్పుడూ ప్రజల కోసమే అధికారం ఉపయోగిస్తోందని వివరించారు. ఆడవాళ్లపై అఘాయిత్యాలు చేస్తే అదే మీకు చివరిరోజు జాగ్రత్త అని సీఎం హెచ్చరించారు.వైఎస్సార్సీపీ నా సవాల్‌కి సిద్ధమా: వైఎస్సార్సీపీ నేతలు మొన్నటివరకు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కానీ అసెంబ్లీకి వచ్చేందుకు సిద్ధమా? అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సీఎం సవాల్ విసిరారు. మొన్న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలపై చర్చకు సిద్ధమని, అలానే వివేకా హత్య, కోడికత్తి డ్రామా, గులకరాయి నాటకాలపైనా చర్చకు సిద్ధమని అన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో అనర్హులు కూడా దివ్యాంగుల పింఛను తీసుకున్నారని కానీ నిజమైన దివ్యాంగులకు మేం న్యాయం చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు రాయలసీమలో రక్తం పారించారని కానీ కూటమి వచ్చాక రాయలసీమలో సాగునీరు పారిస్తున్నామని చంద్రబాబు అన్నారు.

## తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట పెరుగుతుంది



**మొదటిపేజీ తరువాయి** – యత్నమని, రాజ్యాంగాన్ని పరిరక్షించి పేదలకు రిజర్వేషన్లు పెంచాలనేది ఇండీ కూటమి యత్నమని సీఎం తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఇండీ కూటమి ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. ఇటీవల ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా అందరినీ ఆశ్చర్యం కలిగించిందని, ఉపరాష్ట్రపతి రాజీనామాకు ఒత్తిడి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడిందని, రాజ్యాంగం మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనే అజెండాతో ఎన్‌డీఏ అభ్యర్థిని నిలిపారని ఆరోపించారు. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలు ఎప్పుడైనా మాట్లాడవచ్చని అన్నారు.ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలి : తెలుగు వ్యక్తి రాజ్యాంగ నిపుణుడికి ఒక అవకాశం వచ్చిందని, తెలుగు వారి గౌరవం, ప్రతిష్ట పెంపొందించేందుకు అభ్యర్థిని నిలిపామని, రాజకీయాలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అండగా నిలబడాలని కోరారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, అసదుద్దీన్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని, ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని కోరుతున్నానని అన్నారు."జాతీయ స్థాయిలో తెలుగు ప్రజల ఉనికి ప్రమాదంలో పడింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించాం. ఇండీ కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గౌరవించి ఎన్నికల బరిలో నిలిచారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో ఎన్‌డీఏ కూటమికి బలమైన సవాల్ విసిరాం. ఇటీవల ఉపరాష్ట్రపతి రాజీనామా అందరికీ ఆశ్చర్యకరం. ఉపరాష్ట్రపతి రాజీనామాకు ఒత్తిడి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. తెలుగు వారి గౌరవం, ప్రతిష్ట పెంపొందించేందుకు అభ్యర్థిని నిలిపాం. రాజకీయాలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అండగా నిలబడాలి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, జగన్, కేసీఆర్, అసదుద్దీన్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను. ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని కోరుతున్నాను. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట దిల్లీ స్థాయిలో పెరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# హరీశ్ రావు, సంతోష్ నాపై కుట్రలు చేశారు



**మొదటిపేజీ తరువాయి** – అన్నారు.హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయిందని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని, అందులో ఐదేళ్ల పాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు పాత్ర లేదా అని ప్రశ్నించారు. సంతోష్, హరీశ్ రావు, మేఘా ఇంజినీరింగ్ వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందని ఆమె అన్నారు.ఈరోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నానని అన్నారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి, లేకపోతే ఏంటి అని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇది తన తండ్రి పరువుకు సంబంధించిన విషయమని ఆమె అన్నారు. తన లేఖ గతంలో బయటకు వచ్చినప్పటికీ తాను ఎవరి పేర్లనూ బయటపెట్టలేదని తెలిపారు. కేసీఆర్ జనం కోసం పనిచేస్తే అవతలి వాళ్లు ఆస్తుల పెంపు కోసం పనిచేశారని ఆరోపించారు.కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారని కవిత అన్నారు. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఇబ్బంది పడ్డారు... అలాంటి దేవుడి లాంటి వ్యక్తిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించడం బాధగా ఉందని అన్నారు. కేసీఆర్‌ను నిన్న అన్ని మాటలు అంటుంటే ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు పెడతారు కానీ సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. బీహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను బలి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ కాదు.. ఇంకే విచారణ జరిపినా కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## దివ్యాంగుల పెన్షన్ ను రూ.15 వేలు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే



**మొదటిపేజీ తరువాయి** – తెనాలి నియోజకవర్గంలోని జాగర్లమూడి గ్రామంలోని సుల్తానాబాద్ కాలనీల్లో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత తీసుకువచ్చేందుకే లబ్ధిదారుల ఇంటి వద్దకే నేరుగా పెన్షన్ మొత్తాన్ని అందిస్తున్నామని తెలిపారు. కేవలం తెనాలి నియోజకవర్గంలోనే 35,563 మందికి రూ. 14.99 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సాధారణ పెన్షన్‌ను రూ. 2,000 నుంచి రూ. 4,000కు, దివ్యాంగుల పెన్షన్‌ను అర్హతను బట్టి రూ. 6 వేలు, రూ. 10 వేలు, రూ. 15 వేలకు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు వంటి నిస్సహాయ వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే సామాజిక భద్రతా పెన్షన్లకు అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వితంతువులకు కూడా త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

**స్థానిక అభివృద్ధికి హామీ**

ఈ పర్యటనలో భాగంగా మంత్రి నాదెండ్ల మనోహర్ పలు స్థానిక అభివృద్ధి పనులపై హామీ ఇచ్చారు. జాగర్లమూడిలో సదరం క్యాంపు ఏర్పాటు చేస్తామని, పాఠశాల భవనం, పంచాయతీ కార్యాలయం, రహదారుల నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఈ నెలలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తామని, సైడ్ కాలువల ఆధునీకరణ, రక్షిత మంచినీటి సరఫరా వంటి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ, త్వరలో స్మార్ట్ రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ ప్రాంతంలో నిమ్మ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ భూప్రకంపనలు



**మొదటిపేజీ తరువాయి** – ఆఫ్ఘనిస్తాన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. భారీ భూప్రకంపనల కారణంగా వందలాది మంది మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లో భూప్రకంపనలు వచ్చాయి. రిక్టార్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 6.3గా నమోదైంది. తాజా సమాచారం ప్రకారం.. ఇప్పటి వరకు 600 మందికిపైగా చనిపోయినట్లు తెలుస్తోంది. మరో 400 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారితో అక్కడి ఆస్పత్రులు నిండిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు ఊపందుకున్నాయి.ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ మాట్లాడుతూ.. 'చాలా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. భూప్రకంపనలు సంభవించిన ప్రదేశాన్ని చేరుకోవటం చాలా కష్టమైన పనిగా మారింది. అయినప్పటికీ సహాయక బృందాలు అక్కడే ఉండి చురుగ్గా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి' అని అన్నారు. ఆఫ్ఘనిస్తాన్ హోమ్ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం మృతుల సంఖ్య 622కు చేరినట్లు రాయిటర్స్ పేర్కొంది. కాగా, ఆఫ్ఘనిస్తాన్‌లో వచ్చిన భూ ప్రకంపనల ధాటికి పాకిస్తాన్‌తోపాటు ఉత్తర భారతదేశంలోనూ ప్రకంపనలు సంభవించాయి. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో ప్రకంపనలు వచ్చాయి. భవనాలు కంపించటంతో జనం భయంతో వీధుల్లోకి పరుగులు పెట్టారు.

**రెండేళ్ల క్రితం ఇంతకు మించిన ఘోరం**

2023లో ఆఫ్ఘనిస్తాన్‌లో ఇంతకు మించిన ఘోర విషాదం చోటుచేసుకుంది. భారీ భూప్రకంపనలు వచ్చాయి. రిక్టార్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 6.3గా నమోదైంది. ఆ సమయంలో తాలిబన్ రిపోర్టు ప్రకారం.. 4 వేల మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. యునైటెడ్ నేషన్స్ లెక్కల ప్రకారం కనీసం 1,500 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్ భూప్రకంపనలకు అడ్డాగా మారిపోయింది. మరీ ముఖ్యంగా హిందూ ఖుష్ పర్వతాల పరిధిలో ఎక్కువగా భూప్రకంపనలు వస్తున్నాయి.

# ఏపీలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



**మొదటిపేజీ తరువాయి** – బంగాళాఖాతంలో రాబోయే 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఈ అల్పపీడనం ప్రభావంతో మంగళవారం, బుధవారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే, శుక్రవారం మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది.మరోవైపు, ఏపీఎస్డీఎంఏ కూడా అల్పపీడనంపై అంచనాలు వెలువరించింది. ఈశాన్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న మయన్మార్ తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో రాబోయే 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ వివరించింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

**సెప్టెంబర్ 01 ( ప్రతినిధి బాసర ) నిర్మల్ జిల్లా :** బాసర రైతులు పంటలు నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక ఆదుకొని అండగా నిలుస్తుందని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి అన్నారు. మండల కేంద్రమైన ముధోల్ లో సోమవారం సాయంత్రం ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను అలాగే రోడ్డును పరిశీలించారు. రైతులకు పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ నష్టపోయిన పంట వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. త్వరలోనే అధికారులు కూడా ప్రాథమిక సర్వే కొనసాగిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు తప్పక ఆదుకుంటామని చెప్పారని అన్నారు. అలాగే ఇటీవల కురిసిన భారీ



వర్షాలకు దెబ్బతిన్న పంటలే కాకుండా ఇండ్లు తదితర వాటిని కూడా ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.

ఇప్పటికే పెద్ద ఎత్తున ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది గుర్తు చేశారు. జిల్లాలోని జరిగిన నష్టంపై వెంటనే అధికారులకు కూడా తెలియజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్, ఖాలీద్ పటేల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# లంచంపై అధికారుల 'నిర్భయం' వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి?

**నిర్మల్:నవంబర్01:తెలంగాణ సేనా న్యూస్ :** తెలంగాణలో ఏసీబీ దూకుడుగా వ్యవహరిస్తున్నా, అవినీతి అధికారులు భయపడటం లేదు. ఒకవైపు దాడులు పెరుగుతుంటే, మరోవైపు లంచాల దందా ఆగడం లేదు. ఎందుకు ఉద్యోగులు ఏసీబీకి భయపడటం లేదు? జీతం కంటే అవినీతి ద్వారా వచ్చే డబ్బులే ఎక్కువ అనే ఆశ, చట్టాల్లో ఉన్న లొసుగులే దీనికి కారణమా?ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి అనేది ఒక దీర్ఘకాలిక సమస్య. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దీనితో ఏసీబీ దూకుడు పెంచి, గడచిన 8 నెలల్లో 167 మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేసింది. ఇందులో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు ఎక్కువగా ఉన్నారు. ఈ దాడుల వల్ల కొన్ని వేల కోట్ల విలువైన ఆస్తులు పట్టుబడ్డాయి. కానీ, ఈ అరెస్టులు, దాడులు అవినీతిని పూర్తిగా తగ్గించలేకపోతున్నాయి.ప్రభుత్వ కార్యాలయాలలో పని చేసే ప్రతి ఒక్కరూ ఒక సేవకుడుగా ఉండాలి, ప్రజలకు సేవ చేయడమే వారి ప్రధాన కర్తవ్యం. కానీ, చాలామంది అధికారులు దీనికి విరుద్ధంగా లంచాల కోసం ఆశపడుతున్నారు. ఈ స్వభావం వ్యవస్థను నాశనం చేస్తుంది. ప్రజల నమ్మకాన్ని దూరం చేస్తుంది. అవినీతికి పాల్పడటానికి ప్రధాన కారణాలు చాలా ఉన్నాయి. అవినీతికి పాల్పడిన తర్వాత కూడా చాలామంది అధికారులు తమ ఉద్యోగాన్ని కోల్పోవడం లేదు. జైలు శిక్ష పడిన తర్వాత కూడా బెయిల్ పై బయటికి రావడం, కొద్ది కాలం తర్వాత మళ్ళీ ఉద్యోగంలో చేరిపోవడం వంటివి చూస్తుంటే ఉద్యోగులకు ఒక రకమైన ధైర్యం వచ్చినట్టు తెలుస్తోంది. "ఏదైనా జరిగినా, కొన్నాళ్ల తర్వాత మళ్ళీ ఉద్యోగం వస్తుంది" అనే ధీమా వారిని అవినీతికి ప్రేరేపిస్తుంది. జీతం కంటే అక్రమంగా సంపాదించే డబ్బులే ఎక్కువ అనే ఆలోచన కూడా అవినీతిని పెంచుతోంది.అవినీతిని పూర్తిగా నిర్మూలించాలంటే, కేవలం అరెస్టులు చేస్తే సరిపోదు. చట్టాలను కఠినతరం చేయాలి. ప్రభుత్వం ఈ విషయంలో కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాలు అవినీతి అధికారులకు ఒక రకంగా రక్షణ కల్పిస్తున్నాయని భక్తులు, ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా, ఉద్యోగం నుండి పూర్తి తొలగింపు లేకపోవడం ఒక పెద్ద సమస్య. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను సవరిస్తున్నప్పటికీ, అవినీతికి పాల్పడిన ఉద్యోగులను ఉద్యోగం నుంచి తొలగించే చట్టాన్ని ఎందుకు మార్చడం లేదన్నది ఒక ప్రశ్నగా మిగిలింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అవినీతి మరింత పెరిగి సమాజాన్ని పట్టి పీడించే అవకాశం ఉంది.అవినీతిని నిర్మూలించాలంటే, ప్రభుత్వం ఉద్యోగులకు రక్షణగా ఉన్న చట్టాలను సవరించాలి. అవినీతి నిరూపణ అయిన తర్వాత, ఉద్యోగం నుంచి పూర్తి తొలగింపు, బెయిల్ దొరకని కఠిన శిక్షలు వంటివి అమలు చేస్తే, ప్రతి అధికారికి భయం కలుగుతుంది. అప్పుడే అవినీతికి పాల్పడే ముందు ఒక్కసారి అయినా ఆలోచించే పరిస్థితి వస్తుంది. లేకపోతే ఏసీబీ ఎన్ని దాడులు చేసినా, ఎంతమందిని అరెస్ట్ చేసినా, అవినీతిని పూర్తిగా అంతం చేయడం కష్టం. అవినీతికి పాల్పడిన వారిని ఉద్యోగం నుండి పూర్తిగా తొలగించడమే కాకుండా, వారి ఆస్తులను జప్తు చేసి, ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాలి. అప్పుడే లంచం తీసుకోవడానికి భయపడే పరిస్థితి వస్తుంది. ఈ కఠిన చర్యలు తీసుకుంటే, ప్రజలకు నిజమైన సేవలు అందుతాయి.ప్రస్తుతం ఉన్న చట్టాలలో ప్రధానమైనవి అవినీతి నిరోధక చట్టం, 1988.ఈ చట్టం లంచం తీసుకున్న, అవినీతికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులను విచారించి శిక్షించడానికి ఉద్దేశించబడింది. అయితే, ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు, ముఖ్యంగా విచారణలో జాప్యం, మరియు తక్కువ శిక్షలు, అవినీతిపరులకు అనుకూలంగా మారుతున్నాయి. ఉదాహరణకు, నిందితులకు బెయిల్ త్వరగా లభించడం, మరియు విచారణలో న్యాయపరమైన లోపాలు చూపించడం ద్వారా శిక్ష నుండి తప్పించుకోవడానికి అవకాశం ఉంది. అంతేకాకుండా, లిభారత శిక్షా స్మృతిలోని కొన్ని సెక్షన్లు కూడా అవినీతి కేసులలో ఉపయోగించినప్పటికీ, ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించిన చట్టాలు వారిని తొలగించకుండా రక్షణ కల్పిస్తున్నాయి. ఈ రక్షణ కవచాన్ని తొలగించాలంటే, ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకురావాలి లేదా ప్రస్తుత చట్టాల్లో ముఖ్యమైన సవరణలు చేయాలి. అప్పుడే అవినీతికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడే అవకాశం ఉంటుంది.



**వెంక గారి భూమయ్య**
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863

# రైతులపై కపటప్రేమను మానుకోండి

**2 లక్షల వరకు రైతు రుణమాఫీ తో రైతుల చరిత్రలో నిలిచిపోయింది.**

**సంగ స్వామి జిల్లా ఉపాధ్యక్షులు రాజన్న సిరిసిల్ల**

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్**

**వేములవాడ, సెప్టెంబర్ 1 (తెలంగాణ సేన) :** బీజేపీపై మాట్లాడే దమ్ము లేని బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చెప్పిన మాట కేంద్ర%శీ% లో నరేంద్ర మోడీ ప్రభుత్వం తప్పిదం వల్లే యూరియా కొరత ఏర్పడిందని చెప్తుంటే.,బారాస నాయకులకు కళ్ళు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.. గతంలో మీ ప్రభుత్వం ఉన్నప్పుడు మీ పార్టీ పక్షాన గెలిచిన శాసనసభ్యుడు రమేష్ బాబు ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి నోచుకోకుండా చేసి విదేశాలలో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ ఈ ప్రాంత వెనుకబాటుకు కారణమైన సంగతి



మర్చిపోయారా అని గుర్తుచేశారు...మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీ కేసీఆర్ ది కాదా అన్నారు.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి 18 మాసాలలో ఈ ప్రాంత అన్ని విధాల అభివృద్ధి జరుగుతుంటే మింగుడు పడని మీరు యూరియాను అడ్డంపెట్టుకొని రైతులపేరిట రాజకీయ పబ్బం గడపడం మానుకోండి మండిపడ్డారు.. మీ ప్రభుత్వ హయాంలో రైతుల చేతులకు సంకెళ్లు వేసిన సంగతి,ఆరోజు లైన్లో నిలబడి రైతులు గుండెపోటుతో చనిపోయిన రైతులను పట్టించుకొని మీరా రైతుల గురించి మాట్లాడేదని అన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వేములవాడ అభివృద్ధి చేస్తూ మర్రిపల్లి,కలికోట సూరమ్మ ప్రాజెక్ట్, లచ్చంపేట చెరువు వంటి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తుంటే ఓర్వలేకనే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.. బర్రెల,గొర్రెల,కాళేశ్వరం లో,లిక్కర్ పైన, ఈ కార్ రేస్ వంటి స్కాం లతో మొత్తం రాష్ట్రాన్ని దోచుకొని,రాష్ట్ర ఖజానా మొత్తం ఇతర రాష్ట్రాల్లో చెక్కుల రూపంలో పంచిన ఘనుడు మీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కాదా అని ప్రశ్నించారు. మీరు ఎన్ని రకాల రైతులను రెచ్చగొట్టిన మీ మాటలను నమ్మే రోజులు పోయాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో మీ పార్టీ పూర్తిగా కనుమరుగు కావడం ఖాయమన్నారు. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా రైతులను రెచ్చగొట్టడ%శీ% మానుకోవాలని కోరారు. వారి వెంట రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం,డైరెక్టర్ మానుపాటి పర్షరాములు,మాజీ ఉపసర్పంచ్ అక్కేన పెల్లి నరేశ్ తదితరులు ఉన్నారు.

# వేములవాడ పట్టణంలో యూరియా కొరత

**ఎరువుల కోసం లైన్ లో నిల్చున్న రైతన్నల బాధలను చూసి నిరసన చేసిన బిఆర్ఎస్ నాయకులు**


**వేములవాడ, సెప్టెంబర్ 1 (తెలంగాణ సేన) :** వేములవాడ పట్టణంలో యూరియా కోసం రైతన్నలు సోమవారం ఉదయం నుంచి భారీగా క్యూ కట్టారు. గత కొన్ని రోజులుగా యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నామని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రైతన్నలు వేడుకుంటున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో పలు ఫర్టిలైజర్ షాప్ ల వద్ద రైతన్నలు గుమ్మిగుడి దర్శనమిచ్చారు పట్టణ,రూరల్ రైతులు లైన్ లో ఉండి నిరసపడిన మహిళ రైతులకు వాటర్ బాటిల్స్ అందించి సంఘీభావం గా రైతుల పక్షానా బిఆర్ఎస్ పార్టీ పక్షాన నిరసన చేశారు .ఈ సందర్భంగా సినియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్,సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజులు మాట్లడుతూ రైతులకు ఇందిరమ్మ రాజ్యం తెస్తానని ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు ఏ గోస పడ్డారో ఆవిధంగానే నీళ్లకోసం,కరెంట్ కోసం ఇప్పటి యూరియా కోసం ఆనాటి రోజులు తెచ్చాడని ఏద్దేవా





చేశారు.రైతు ఏడ్చిన రాజ్యం,ఎద్దు ఏడ్చిన ఏవుసం వల్ల ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదని విమర్శించారు.వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,స్థానిక కాంగ్రెస్ నాయకులు లైన్ లో నిల్చున్న వ్యక్తులు రైతులు కారని కావాలని చేస్తున్నారని మాట్లాడడం సిగ్గుచేటు ఆనీ కండ్లు ఉండి చూడలేని స్థితిలో కాంగ్రెస్ పార్టి ఉందనీ అన్నారు.రాజన్న సిరిసిల్లలో యూరియా కోరత లేదనీ అజ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.మొన్న స్థానిక ఎమ్మెల్యే స్వంత గ్రామం రుద్రంగిలో,నిన్న మొన్న చందుర్తిలో,ఎల్లారెడ్డి పేట ఈరోజు వేములవాడ నియెజకవర్గ కేంద్రంలో యూరియా కోసం బారులు తిరరానీ ,క్యూలో నిల్చున్న రైతులే స్వయానా 10యేండ్లల్లో ఎప్పుడు క్యూలో నిల్చోలేదనీ ఆంటున్నారనీ ప్రశ్నించారు బిజెపి,రాష్ట్రంలో కాంగ్రెస్ యూరియా కోరత సృష్టించి రైతులను ఆరి గోసపెడుతున్నారనీ మండిపడ్డారు. ఇకనైనా సకాలంలో రైతులకు యూరియా సరఫరా చేయాలని బిఆర్ఎస్ పార్టి తరపున డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టి మండల అధ్యక్షులు గోస్కుల రవి,సినియర్ నాయకులు ఈర్లపల్లి రాజు,మారం కుమార్,శ్రీకాంత్ గౌడ్,నిరటి మల్లేశం,ఆంజత్ పాష,మంతె సందీప్, ఆసద్, పోతు ఆనీల్,షాహిద్,కోమిరె వెంకటసాయి,ఉమర్,రాజు తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎస్పీ డా. జి. జానకి షర్మిల



**నిర్మల్,:నవంబర్ 01:తెలంగాణ సేనా న్యూస్ :** బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ హాజరై నిర్మల్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదుదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందించి, వారి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి ఫిర్యాదులను స్వీకరించాలని, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. దీనివల్ల ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం, భరోసా పెరుగుతాయని అన్నారు.గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటామని ఎస్పీ తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం వల్ల వాటిని త్వరగా పరిష్కరించవచ్చని ఆమె చెప్పారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే తమ లక్ష్యమని ఎస్పీ పునరుద్ఘాటించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



**నిర్మల్ :నవంబర్ 01:తెలంగాణ సేనా న్యూస్ :** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.ప్రతి ప్రజావాణి దరఖాస్తును పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు., మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలి అని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి అనంతరం కలెక్టర్ సమీక్షిస్తూ, అధికారులు వరద సమయంలో తీసుకున్న తగు చర్యలను ప్రశంసిస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా, వరద నష్ట నివేదికలు సిద్ధం చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక సర్వేను త్వరితగతిన పూర్తి చేయడం, వనమహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయడం, ప్రభుత్వ బడులను ఎప్పటికప్పుడు పరిశీలించి తక్షణ చర్యలు ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటాయిలో మహా అన్నదానం



**కొత్తగూడ తెలంగాణ సేన :** మండలం లోని ఓటాయి లో శ్రీ సీతారామచంద్ర స్వామి శివాలయంలో శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు ప్రతిరోజు ధూప దీప నైవేద్యాలతో పండిట్ భాను ప్రసాద్ వేద మంత్రోచ్చారణ నడుమ పూజలు నిర్వహించారు విగ్రహదాత పాలడుగు రేణుకా దేవి ఉత్సవాల్లో భాగంగా దాతల దాతృత సహాయంతో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు దాతలు స్వర్గీయ దీకొండ మాధవరావు జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీకాంత్, వంశీకృష్ణ పాలడుగు రాధిక శ్రీధర్ కుడికాల రమేష్ దాతల సహాయంతో ఉత్సవ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు పొందినారు.

## బోరిగాంలో ఇల్లు దగ్ధం

**రూ.65వేల ఆస్తి నష్టం**

**ముధోల్,01సెప్టెంబర్ (తెలంగాణ సేనా న్యూస్) :** ముధోల్ మండలంలోని బోరి గాం గ్రామానికి చెందిన లక్ష్మి అ నేమహిళ ఇంటికి సోమవారం ఉదయం ప్రమాదవశాత్తుగా నిప్పు అంటుకోని ఇల్లు దగ్ధ మైంది. స్థానికులు కథనం ప్రకా రం తన ఉన్న ఇంట్లోని దేవు ళ్ళ కు దీపం ముట్టించి వేరే ఊరికి బాధితురాలు బయలు



దేరింది. ప్రమాదవశా త్తు ఆ దీపం ఇంటికి తగిలి మంటలు అంటుకున్నాయి. ఈ విషయా న్ని గమనించిన స్థానికులు బాధితురాలికి ఫోన్ చేసి సమా చారం అందించారు.మంటలు చుట్టు పక్క వ్యాపించకుండా నీళ్లను స్థానికులు పోసి మంట లను ఆర్పి వేశారు. ఇంట్లో ఉ న్న బట్టలు, ఆహార ధాన్యాలు, నగదు 20వేల రూపాయలు, కాలి బూడిద అయ్యాయని బాధితురాలు లక్ష్మి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్ ఐ నారాయణ పటేల్ సంఘట న స్థలానికి చేరుకొని ప్రమాదం కు గల వివరాలను అడిగి తె లుసుకున్నారు.స్థానికుల సమ క్షంలో పంచనామ నిర్వహిం చారు. సుమారు 65 వేల వర కు ఆస్తి నష్టం వాటిల్లిందని చేసినట్లు బాధిత మహిళ తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.

## ముధోల్‌లో కొలువుదీరిన, గణనాథులు



**ముధోల్,నవంబర్01(తెలంగాణసేనా న్యూస్.) :** మండల కేంద్రమైన ముధోల్ తోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వి నాయక నవరాత్రి ఉత్సవాలు బుధ వారం ఘనంగా ప్రారంభమయ్యా యి.మండల కేంద్రంలోని చైతన్య యువజన సంఘం,ముదిరాజ్,రామ్ ముందిర్,గంగపుత్ర,విద్యార్థి,మన్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో ప్ర త్యేకంగా ఏర్పాటుచేసిన మండపాల లో గణనాథులను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాల మధ్య గణనాథునికి పు వ్వులు,గరక, ప్రీతి ప్రతమైన ఉండ్రా ల పాయసాన్ని సమర్పించి మొక్కు లను తీర్చుకున్నారు.7 రోజులపాటు గణనాథుని భక్తిశ్రద్ధలతో పూజలను భక్తులు నిర్వహించనున్నారు. భక్తు లు ఇండ్లలో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలను చేశారు. దీంతో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్ర మాలు,అన్నదాన చేపట్టనున్నారు. వాడవాడలో గణనాథులు కొలువు తీరడంతో పండుగ వాతావరణం నెలకొంది.

## భోసి వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు



**తానూర్, నవంబర్ 01:** నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని భోసి గ్రామంలో జరుగుతున్న వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి,ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై,స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు,భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది,నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు,ఈ సందర్భంగా ముధోల్ లోని రబింద్ర హై స్కూల్ విద్యార్థుల బృందం ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు,ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి, ఈ ప్రదర్శనలు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించాయి.

## భారీ వర్షాల నష్టాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్

**తానూర్:నవంబర్ 01:తెలంగాణ సేనా న్యూస్ :** తానూర్ మండలంలోని కోలూర్, మొగిలి, జౌలా(కె), తోండాల గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, పంటలను మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పటేల్ పరిశీలించారు,ఈ పర్యటనలో ఆయన రైతులతో మాట్లాడి వారికి ధైర్యం



చెప్పారు.ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చి ఈ సందర్భంగా పటేల్ మాట్లాడుతూ, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు, ఈ విషయాన్ని నిర్మల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు,ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మైనార్టీ ఇంచార్జి లతీఫ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యం రెడ్డి, తానూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుండ్లిక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రకాంత్, గోవింద్ పటేల్, మాజీ ఎంపీపీలు సాధశివ్ పాటిల్, మధు పాటిల్, అట్టల్ దేవిదాస్, సాజిత్,మండల నాయకులు,తదితరులు, పాల్గొన్నారు..పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కొరత లేదన్న జిల్లా కలెక్టర్.



**నిర్మల్ :నవంబర్ 01:తెలంగాణ సేనా న్యూస్ :** జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లాలో అవసరమైనంత మోతాదులో యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఎరువుల దుకాణాలను ఉదయం 8 గంటలకు తెరిపిస్తున్నామని చెప్పారు. రైతులు ఒకేసారి గుంపులుగా దుకాణాలకు వెళ్లకుండా విడతల వారీగా వెళ్లి అవసరమైనంత మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా కొరతపై అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని, జిల్లాలోని ప్రతి రైతు అవసరానికి తగ్గట్టుగానే యూరియా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎరువుల సరఫరా పర్యవేక్షణకు వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

## కొత్తగూడ మండలం లో గొల్ల కురుమ యాదవ సదస్సు కరపత్రాలు ఆవిష్కరణ



**కొత్తగూడ తెలంగాణ సేన :** 42 శాతం రిజర్వేషన్ల సాధనకై గొల్ల కురుమ యాదవులు ఏకం కావాలి.రిజర్వేషన్లకు కోసం ఐక్య మత్యంతో పోరాటానికి సిద్ధం కావాలి.మహబూబాబాద్ జిల్లాలో ఐదవ తేదీన యశోద గార్డెన్ నర్సంపేట బైపాస్ రోడ్డు లో జరిగే సదస్సును విజయవంతం చేయాలి.గొల్ల కురుమ యాదవ సదస్సు కరపత్రంను ఆవిష్కరణ చేసిన టీ పిసిసి వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్ ఈ కార్యమానికి కొత్తగూడ మాజీ వైస్ ఎంపీపీ కడబోయిన జంపన్న యాదవ్, యాదవ సంఘం అధ్యక్షుడు ననుబోతుల లింగన్న యాదవ్, ఆవుల అశోక్ యాదవ్ తుపాకుల పరశరాములు కుర్మా నోముల ప్రశాంత్ యాదవ్, దాసరి అశోక్ యాదవ్, బండి గణేష్ యాదవ్తోట కురి మదు యాదవ్,రదారపు మల్లేష్ యాదవ్ చేవ్వ అనిల్ యాదవ్.రైతులపై కపటప్రేమను మానుకోండి.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా రైతుల పక్షపాతిగా ఉంటుంది.

# గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలి

## గిరిజన శక్తి అధ్యక్షులు సాయినాథ్



**ముధోల్:నవంబర్ 01:తెలంగాణ సేనా న్యూస్ :** భైంసా,సెప్టెంబర్ 01: గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులపై చర్యలు తీసుకోవాలని గిరిజన శక్తి అధ్యక్షులు రాథోడ్ రామనాథ్ నాయక్ డిమాండ్ చేశారు, భైంసాలో మీడియాతో మాట్లాడుతూ, స్వార్థ రాజకీయాల కోసం ఈ ఇద్దరు నాయకులు గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు, దివంగత ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో 1976 పార్లమెంట్ చట్టం ద్వారా లంబాడీలను గిరిజన జాబితాలో చేర్చారని ఆయన గుర్తు చేశారు, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే సంప్రదాయం కలిగిన తెగలను ఒకే కేటగిరిలో చేర్చాలనే ఉద్దేశంతోనే లంబాడీలను గిరిజనులుగా గుర్తించారని వివరించారు, ఈ వాస్తవాలు తెలియకుండా కొంతమంది కుట్రలు చేస్తున్నారని హెచ్చరించారు, ఈ కుట్రలను తక్షణమే మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నీట మునిగిన పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ నేతలు



**సెప్టెంబర్ 01 ( ప్రతినిధి బాసర ) తెలంగాణ సేన నిర్మల్ జిల్లా :** బాసర మండల కేంద్రంలో గోదావరి నది భారీ ఎత్తున వరద రావడం వలన బాసర మండల కేంద్రంలోని 10 గ్రామపంచాయతీలో పరిధిలో దాదాపు 6 వేల ఎకరాలలో పంట నష్టం జరిగింది.అదేవిధంగా బాసర ఆలయ పరిసరాలలో పలు ప్రైవేట్ లాడ్జిలు, దుకాణ సముదాయాలు భారీ ఎత్తున నష్టం జరిగినది.ఈ నేపథ్యంలో బాసరకు టిఆర్ఎస్ పార్టీ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవర్ బాసర పలు కాలనీలతో పాటు ప్రైవేట్ లాడ్జీలను సందర్శించి బాధితులకు మేము అండగా ఉంటామని తెలియజేయడం జరిగింది.అదేవిధంగా బాసర వరద నీరు తగ్గుముఖం పట్టిన పరిసరాల పరిశుభ్రత కూడా చాలా ముఖ్యమైన ఈ నష్టంతో పాటు ఆరోగ్యం కూడా నష్టపోకూడదు అని గ్రామపంచాయతీ అధికారులకు శానిటేషన్ పరంగా త్వరితగతిన చేయాలని చెప్పడం జరిగింది.అదేవిధంగా బాసర మండల పరిధిలోని ఓని, కౌటా, సవర్గావ్, కిర్గుల్కే %ఎ% గ్రామాలలో నష్టం వాటిల్లిన పంటలను పరిశీలిస్తూ రైతులను ఓదార్చి ప్రతి ఎకరానికి 25వేల రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే రైతుకు అందించాలని రైతులు అధర్య పడకూడదు అని వారికి మేము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ప్రభుత్వం వెంటనే రైతులందరినీ ఆదుకోవాలని లేనియెడల పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేయబడుతుందని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ కోర్వ శ్యామ్ , పార్టీ సీనియర్ నాయకుడు సుకం రామారావు, గంగారావు, నర్సింగరావు, లాల్మియా,సదానంద్, సంజీవరావు, పోశెట్టి, నాగరాజ్, వాజిద్, శ్రీనివాస్, గంగాధర్ వివిధ గ్రామాల రైతులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.కెసిఆర్ గారు ఈ ఆపద సమయంలో ఉంటే మాకు అండగా ఉండేది వెంటనే మాకు ధైర్యాన్ని ఇచ్చేవారు అని రైతులు వెళ్లబుచ్చుకున్నారు.

# మట్టి తరలింపుకు అవసరమైన అనుమతులు పొందాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

### రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన మట్టి అనుమతుల పై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్




**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 ( తెలంగాణ సేన) :** జిల్లా లో రైల్వే లైన్ నిర్మాణానికి మట్టి తరలింపు అవసరమైన అనుమతులు పకడ్బందీగా పొందాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన మట్టి అనుమతుల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రైల్వే లైన్ నిర్మాణం కోసం తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామం చంద్రవాగు చెరువు నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి కేటాయింపు చేయగా ఇప్పటి వరకు 90 వేల 672 క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపు జరిగిందని అన్నారు.సిరిసిల్ల లో రైల్వే స్టేషన్ నిర్మాణం, రైల్వే లైన్ నిర్మాణం కోసం సమీపంలో గల పాయింట్ నుంచి అవసరమైన మట్టి తరలింపు కేటాయింపు చేయాలని, దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మట్టి తరలింపు కు తగిన విధంగా సినరేజి చార్జిలు వసూలు చేయాలని అన్నారు. నిర్దేశిత కేటాయింపుల మేరకు మాత్రమే మట్టి తరలింపు జరగాలని, అదనంగా మట్టి తరలించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారి మూర్తి కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### మొత్తం 126 దరఖాస్తుల రాక







**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 ( తెలంగాణ సేన) :** ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 126 దరఖాస్తులు వచ్చాయి.రెవెన్యూ శాఖకు 37, హౌసింగ్ శాఖకు 20, డీఆర్డీఓకు 10, జిల్లా విద్యాధికారికి 9, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, జిల్లా ఉపాధి కల్పన అధికారికి 7 చొప్పున, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి 5, ఎస్డీసీ, ఎస్పీ ఆఫీస్ కు 4 చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, సెస్ కార్యాలయానికి 3 చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి, ఎస్సీ కార్పొరేషన్, ఏ డీ ఎస్ ఎల్ ఆర్, జిల్లా ఉద్యానవన అధికారికి రెండు చొప్పున, జిల్లా వైద్యాధికారి, ఈఈ మిషన్ భగీరథ, సబ్ రిజిస్టర్ సిరిసిల్ల, ఈఈ పీఆర్, డిస్ట్రిక్ట్ మైనార్టీ ఆఫీస్, ఎంపీడీఓ తంగళ్ళపల్లి, ఇల్లంతకుంటకు ఒకటి చొప్పున వచ్చాయి.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

### విద్యాలయం పరిసరాలు పరిశుభ్రం చేయించాలని ఆదేశాలు



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 (తెలంగాణ సేన) :** ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గదికి వెళ్లారు. ఆహార పదార్థాలు సిద్ధం చేస్తుండగా, పరిశీలించారు. అనంతరం 6 నుంచి 10 తరగతి గదుల్లోని విద్యార్థుల ను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తుండగా, పరిశీలించారు. 10 వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని సాధన చేయించాలని సూచించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఆవరణ అంతా మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని సూచించారు.

# వాసవి వినాయక్ నగర్ లో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ 20 వ వార్డ్ వాసవి వినాయక్ నగర్ లో మట్టి గణపతి విగ్రహం ఏర్పాటు చేసి ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగ గా నిర్వహిస్తున్నారు సోమవారం లయన్స్ క్లబ్ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గణపతి విగ్రహ దాత, అన్న ప్రసాదం దాత నేతి శ్రీలత సంతోష్ దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ పాస్ట్ రీజియన్ చైర్మన్ లయన్ గోలి సంతోష్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ వైస్ చైర్మన్ డాక్టర్ కుమార స్వామి,లయన్ నేతి శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరికీ గణపతి నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు వాసవి వినాయక్ నగర్ లో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి విగ్రహం ఏర్పాటు చేసి, అన్నప్రసాదం స్టీల్ ప్లేట్ లో మంచి నీరు స్టీల్ గ్లాస్ లో అందజేయడం అభిందనీయం అని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్,లయన్ రాధాకృష్ణ, లయన్ నాగేంద్రం,అయ్యప్ప శ్రీనివాస్,చఖిలం కృష్ణమూర్తి,విజయ్, ఉప్పల కృష్ణమూర్తి, అత్తెల్లి శ్రీనివాస్,కొమరవెల్లి రమేష్,నేతి శ్రీలత సంతోష్ దంపతులు,మహిళలు, చిన్నారులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కీర్తి శేషులు శిరీష వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**తెలంగాణ సేన :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వంగపల్లి అంజయ్య స్వామి కూతురు కీర్తిశేషులు కోడిత్యాల శిరీష 4 వ వర్ధంతి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డు వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి హాజరై శిరీష చిత్రపటానికి నివాళి అర్పించడం జరిగింది అలాగే ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సముద్రాల కుమార్ రాష్ట్ర కమిటీ సభ్యులు పసుపు నూరి వీరేశం నాగబండ జగదీష్ పట్టణ ప్రధాన కార్యదర్శి సముద్రాల రవి ఐ వి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ శ్రీధర్ గుప్తా మరియు స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్ రావు సందుల సురేష్ మరియు జనం టివి శంకర్ మీడియా ప్రతినిధులు ఎలుగల కుమారస్వామి సంపత్ కుమార్ బిజ్జాల విశ్వనాథం తునికి జానకిరామ్ ఎండి కుర్షిత్ పాషా వెంకటేష్ సిపిఎం పార్టీ నాయకులు జూకంటి పౌలు కాయితి మహేందర్ రెడ్డి ఎడ్లకొండ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపు 500 మంది పాల్గొనడం జరిగింది.

# ఈక సునీల్ కుటుంబానికి అండగా టూవీలర్ మెకానిక్ యూనియన్ మిత్రులు



**కొత్తగూడ తెలంగాణ సేన :** మండలంలోని రాంపూర్ గ్రామస్తులు ఈక సునీల్ టూవీలర్ మెకానిక్ వారు ఇటీవల 8/8/2025 వ తేదీన అకాలమరణం చెందినాడు కావున అతని కుటుంబానికి మెకానిక్ ల యొక్క ఆర్థిక సహాయం మండల యూనియన్ మరియు రాష్ట్ర సంఘం అయినటువంటి వివిధ జిల్లాల నుండి వచ్చిన సహాయం రూపంగా వచ్చిన 60000/ వేల రూపాయలను పోస్ట్ ఆఫీస్ లో అతని యొక్క పిల్లల పేరుమీద కొంత బాండు చేసి అతని కుటుంబంకు అందజేయడం జరిగింది కావున ఇక్కడికి వచ్చినటువంటి రాష్ట్ర అధ్యక్షులు బాబు వర్కింగ్ ప్రెసిడెంట్ జాఫర్ బాయ్ కొత్తగూడ మండల అధ్యక్షులు నామోజు కృష్ణ మరియు తొర్రూరు నుండి సామల రాజు గోపి రాయపర్తి నుండి ఉబ్బని కిషోర్ కుమార్ సింగారం మరియు కేశవపట్నం సాబీర్ మరియు కరీంనగర్ నుండి పోలోజు నరేష్ వరంగల్ నుండి రబ్బాని వాజీవ్ మరియు హుజురాబాద్ జమ్మికుంట నుండి బాసిరి సాంబశివరావు రాంపల్లి జయప్రకాష్ కోశాధికారి అశోక్ అనిల్ సాయి విష్ణు ప్రశాంత్ గంజి శ్రీరామ్ నవీన్ సద్దాం రాకేష్ రాజు శ్రావణ్ గయాజ్ అనిల్ సంతోష్ మరియు అశోక్ నరేష్ అందరు కలిసి వారికి అప్పగించి వారికి కుటుంబానికి మనోధైర్యం కల్పించి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు.

# ముఖ్యమంత్రి సహాయనిది చెక్కును అందజేసిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు



**గంగారం తెలంగాణ సేన :** మండలం లోని పొనుగొండ్ల కు చెందిన పెనక సుభద్ర కు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క వారి సూచనల మేరకు 35000 వేల రూపాయల చెక్కును అందజేసిన గంగారం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనక పురుషోత్తం అనారోగ్యంతో బాధపడుతున్న వారు మెరుగైన వైద్య సేవల కోసం కార్పొరేట్ హాస్పిటల్ లో చికిత్స కొరకు చెల్లించిన బిల్లులను కాంగ్రెస్ పార్టీ మండల కమిటీకి ఇచ్చినట్లయితే మీయొక్క బిల్లులను మంత్రి సీతక్క కు సంబంధిత ఫైలును పంపి దానిని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలన చేసి ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు అందజేస్తారు ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోగలరని అన్నారు.

# ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా?

## ఆర్ / బి అధికారుల నిర్లక్ష్యం



**కొత్తగూడ తెలంగాణ సేన :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కేంద్రం ఓటాయి నుండి రాంపూర్ ( జంగవానిగూడెం ) కు వెళ్లే ప్రధాన రహదారి ఆర్ అండ్ బి రింగు రోడ్డు గత ఏడాది నుండి వరద ఉధృతికి పూర్తిగా దెబ్బతిన్నది సరసన పల్లి నుండి రాంపూర్ కి మధ్యలో ఉన్న కల్వర్టు పెద్ద గండి పడటం తో.. ప్రమాదస్థితి లో పొంచి ఉన్న ముప్పు వెంటనే గమనించిన గ్రామస్తులు జంగవానిగూడెం గ్రామపంచాయతీ కి సంబంధిత ట్రాక్టర్ ను ప్రమాద స్థలం వద్ద అడ్డుగా వేసి ప్రయాణికులకు హెచ్చరికగా తెలియజేసి రక్షణగా సూచించారు రాత్రి సమయంలో టూ వీలర్ ప్రయాణికులు చాలా సందర్భాల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి ఇప్పుడు రాంపూర్ నుండి ఓటాయి కి ఫోర్ వీలర్స్ వెళ్లాలంటే కష్టమే పలుమార్లు సంబంధిత అధికారులకు ప్రజా ప్రతినిధులకు విషయాన్ని తెలిపిన కానీ పట్టించుకున్న వారే లేరు ఈ నిర్లక్ష్యపు అధికారులపై ప్రజలు ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా ?! అని ప్రయాణికులు వాపోయారు.

## కాటలినా చానల్ ఈదేందుకు హైదరాబాద్ తల్లి - కొడుకు సిద్ధం



**సికింద్రాబాద్ తెలంగాణ సేన న్యూస్ :** హైదరాబాద్‌కు చెందిన క్వీనీ విక్టోరియా గాంధం (45), కుమారుడు స్టీఫెన్ కుమార్ (21) అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో సెప్టెంబర్ 7న జరిగే కాటలినా చానల్ స్విమ్ (20 మైళ్లు)లో రిలే టీమ్‌లో పాల్గొననున్నారు. వీరు స్టేట్ అసోసియేషన్ పూల్, ఎల్.బీ.స్టేడియంలో ఎం.సంతోష్ చారి, దినేష్ రాజోరియా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్నారు. యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించడమే వీరి లక్ష్యం.తెలంగాణ మంత్రులు నూతల ఉతమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే నూతల పద్మావతి రెడ్డి, క్రీడల మంత్రి వకాటి శ్రీహరి సహా పలువురు వీరిని అభినందించారు.

# సీజనల్ వ్యాధులను అరికట్టాలి ,కలెక్టరేట్ ముందు ధర్నా

### వైద్య సమస్యలను పరిష్కరించాలి

### ప్రైవేటు వైద్య దోపిడిని నివారించాలి

### ప్రభుత్వ వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

### ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి

### ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్)

### బేజాడి కుమార్

### తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి



**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్ :** ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టడం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున గ్రామీణ ప్రాంతాలలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర విష జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సీజనల్ వ్యాధులను అరికట్టే చర్యలను ప్రభుత్వం చేపట్టాలన్నారు. గ్రామాలలో పాలకవర్గాలు లేకపోవడం మూలంగా పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వెంటనే గ్రామాలలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అనేకమంది ఆదివాసీలు, గిరిజనులు, అమాయక పేద ప్రజలు విష జ్వరాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. విపరీతంగా దోమలు వ్యాప్తి చెంది రకరకాల జబ్బులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వెంటనే దోమతెరలను పంపిణీ చేయాలన్నారు. గ్రామాలలో పల్లె దవాఖానాలు మొదలుకొని మండలాలలో పీ హెచ్ సీ సెంటర్లు అనేక సమస్యలతో నడుస్తున్నాయన్నారు. మండల కేంద్రాలలో 24 గంటల వైద్య సదుపాయం 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్య రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడం మూలంగా ప్రజలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్తున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో విపరీతమైన బిల్లులు వేసి ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నారన్నారు. వైద్య రంగ సమస్యలు పరిష్కరించే వరకు ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ దశల వారీ ఆందోళనా కార్యక్రమాలను కొనసాగిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) జిల్లా అధ్యక్షులు మారుజొడు సిద్దేశ్వర్,జిల్లా సహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, జిల్లా నాయకులు వడ్లకొండ నాగరాజు, కుందే బీరయ్య, పగడాల శివ, నాయకులు పోతగల నరసింహ, సుంచు రాములు, బత్తిని ఉదయ్, పి సతీష్ , బి భాస్కర్ యాదయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఆసనాలతో.. ఒత్తిడి దూరం



ఆధునిక మానవుడు తన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలను భాగం చేసుకుని వాటినుంచి బయటపడేందుకు నిత్యం సతమతమవుతున్నాడు. ఔషధాలతో కుస్తీ పట్టకుండా యోగాసనాలు సాధన చేస్తే.. ఒత్తిడి నుంచి కొంతవరకైనా బయటపడొచ్చు. తేలికైన ఈ మూడు ఆసనాలు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయడం వల్ల ఒత్తిడి దూరం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఉదయం ఓ పది నిమిషాల పాటు ఈ ఆసనాలు వేయడం అలవాటుగా చేసుకుంటే మంచిదని చెబుతున్నారు.

**బాలాసనం:**

వెన్నెముక, నడుము, పాదాలు బలం పెంచుకోవడానికి బాలాసనం ఉపయోగపడుతుంది. ఈ ఆసనంలో మూడు నుంచి ఐదు నిమిషాల పాటు స్థిరంగా ఉండటం వల్ల ఒత్తిడి దూరమవుతుంది. ముందుగా మోకాళ్లపై వజ్రాసనంలో కూర్చోవాలి. నడుమును పైకి ఎత్తకుండా శరీరాన్ని చిత్రంలో చూపించిన విధంగా ముందుకు వంచాలి. తలను నేలకు ఆనించి, చేతులను వెనక్కి చాపి పాదాలను అందుకోవాలి. ఈ భంగిమలో శ్వాసక్రియ నిదానంగా కొనసాగించాలి. ఇలా చేయడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది.

**విపరీత కరణి:**

చిత్రంలో చూపించిన విధంగా కాళ్లను, నడుమును పైకెత్తాలి. ఇలా సాధ్యం కాకపోతే.. ఒక గోడ సాయంతో కూడా ఈ ఆసనం వేయవచ్చు. ఈ ఆసనంలో మూడు నిమిషాలపాటు ఉండి క్రమపద్ధతిలో శ్వాస తీసుకుంటే.. రక్త ప్రసరణ మెరుగవుతుంది. నాడీవ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుంది. మనసు రీఫ్రెష్ అవుతుంది.

**పశ్చిమోత్తాసనం:**

కాళ్లను ముందుకు చాపి.. చిత్రంలో చూపించిన విధంగా.. వంగి చేతులతో పాదాలను అందుకోవాలి. ఈ ఆసనం వల్ల అంతర్గత ఆలోచనలకు కళ్లెం పడుతుంది. మనసు రిలీఫ్ అవుతుంది. వెన్నెముక, భుజాలు, మెడ నొప్పులు తగ్గుముఖం పడతాయి.





# 50 ఏళ్లు అవుతున్నా పూర్తికాని జలాశయం - తీవ్ర అసంతృప్తిలో రైతులు -



నేటికి పూర్తికాని 1977లో శంకుస్థాపన చేసిన వరహాలగెడ్డ జలాశయం - పనికి రాని మొక్కలు, పూడికతో నిండిన ప్రాంతం - కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టు పూర్తి చేయాలని రైతుల విజ్ఞప్తిఅది 1977వ సంవత్సరం. అప్పటికే కరవుతో రైతులు ఏటా ఇబ్బంది పడే పరిస్థితులు. నీటి కొరత లేకపోతే పంటలు పండుతాయని రైతుల ఆశ. కానీ అదెలా సాధ్యమవుతుందనే ప్రశ్న. వీటన్నింటితో సతమతమవుతున్న అన్నదాతల ఆక్రనందనలు చూసి అప్పటి ప్రజా ప్రతినిధులు రిజర్వాయర్ కట్టాలనుకున్నారు. ఎన్నో అవస్థలు పడి అదే ఏడాది శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లొత్తూరు, కంట్రగాడ మధ్యలో రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.దాదాపు యాభై ఏళ్లు అవుతున్నాయి కానీ రిజర్వాయర్ మాత్రం ఇప్పటికీ పూర్తవ్వలేదు. బతికుండగా రిజర్వాయర్ చూస్తామో? లేదో? అని కొంతమంది రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి వరహాల గెడ్డ రిజర్వాయర్?ను పూర్తి చేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.50 ఏళ్లు అవుతున్నా పూర్తికాని జలాశయం - తీవ్ర అసంతృప్తిలో రైతులు%వాటాలతో రైతుల మధ్య విభేదాలు : శ్రీకాకుళం జిల్లా పలాస మండలంతో పాటు మెలియాపుట్టి మండలంలోని కొంత భాగానికి సాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో 1977వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పలాస మండలంలోని లొత్తూరు, కంట్రగాడ గ్రామాల మధ్య వరహాల గెడ్డ రిజర్వాయర్?కు శంకుస్థాపన చేసింది. దాదాపు పదిహేను వందల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సుమారు 200 ఎకరాలు సేకరించింది.రిజర్వాయర్ నిర్మించిన తర్వాత సాగునీటిలో ఎవరికి ఎంత వాటా చెందాలో అన్న విషయంలో పలాస, మెలియాపుట్టి మండలాల రైతుల మధ్య విభేదాలు రావడంతో అప్పట్లో పనులు తాత్కాలికంగా ఆగిపోయాయి. ఈ రిజర్వాయర్ పూర్తయితే కంట్రగాడ, రెంటికోట, అల్లుఖోల, రాజగోపాలపురం, కేదారిపురం, కంబిరిగాం, పలాస, కాశీబుగ్గ, లక్ష్మీపురం, మెలియాపుట్టి మండలం గొప్పిలి గ్రామాలకు సాగు నీరు అందుతుంది. అనంతరం వజ్రపుకొత్తూరు మండలం బెండి వద్ద మరో గెడ్డలో కలుస్తుంది.నక్సల్స్ బెదిరింపులతో ఆగిన పనులు : అలా ఆగిపోయిన పనులను 1997వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ సహకారంతో స్థానిక రైతులంతా కలిసి రిజర్వాయర్ త్వరగా నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నీటి వాటాల్లో కూడా ఎలాంటి గొడవలు పడబోమని అధికారులకు చెప్పారు. స్పందించిన ప్రభుత్వం అప్పట్లో దాదాపు రూ. 70 లక్షలు విడుదల చేసింది. చకచకా పనులు ప్రారంభమయ్యాయి. వేగంగా పనులు జరుగుతుండగా నక్సలైట్ల బెదిరింపులతో రిజర్వాయర్ పనులను మధ్యలోనే ఆపేసి ఆ కాంట్రాక్టర్ పారిపోయాడు.అప్పుడు ఆగిపోయిన పనులు మళ్లీ 2018లో ప్రారంభమయ్యాయి. రూ. 20 లక్షలతో మట్టి పనులు జరిగాయి. తర్వాత వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఈ రిజర్వాయర్?ను కనీసం పట్టించుకోలేదు. ఇప్పటికీ యాభై శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా యాభై శాతం పనులు పెండింగ్?లో ఉన్నాయి. అధికారులు స్పందించి రిజర్వాయర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి, ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం - కోస్తాంధ్రలో భారీ వర్షాలు



మంగళవారం ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం - వచ్చే 5 రోజులపాటు కోస్తాంధ్రలో వర్షాలు పడే అవకాశం ఈశాన్య బంగాళాఖాతంలో రేపు (మంగళవారం) అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోయే 5 రోజులు కోస్తాంధ్రలో వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, ఏలూరు జిల్లాలో ఎల్లో ఎలెర్ట్ జారీ చేశారు. మంగళవారం విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షం పడే అవకాశముందని తెలిపారు. ఏపశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు. తీరం వెంబడి 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.శ్రీకాకుళం జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. కలెక్టర్ స్వప్నల్ దినకర్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డితో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలానే మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మంత్రి అచ్చెన్న కోరారు.మున్నేరులో వరద ఉద్ధృతి: ఎన్టీఆర్ జిల్లాలోని మున్నేరులో వరద ఉధృతి పెరుగుతోంది. పోలంపల్లి డ్యాం నుంచి 25 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం లింగాల కాజ్వేను తాకుతూ వరద పారుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు లింగాల కాజ్వే వద్ద రెవిన్యూ పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లింగాల వద్ద వంతెనను తాకుతూ ప్రమాదకర స్థాయిలో వరద పారుతోంది.కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక: గోదావరిలో వరద ఉద్ధృతి నిలకడగా కొనసాగుతోంది. నాలుగు రోజులుగా తీరమంతా ప్రమాదకరంగానే మారింది. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం 13.9 అడుగుల నీటిమట్టం ఉంది. డెల్టా కాల్వలకు 12,500 క్యూసెక్కుల నీరు పంపిణీ చేస్తున్నారు. ఆనకట్ట 175 గేట్లను ఎత్తి సముద్రంలోకి 11 లక్షల 79 వేల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల చేస్తున్నారు. అఖండ గోదావరి తీరం రాజమహేంద్రవరం వద్ద నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఉదయం నుంచి స్థిరంగానే వరద ప్రవాహం ఉంది. రాత్రి నుంచి క్రమంగా తగ్గే అవకాశం ఉందని జల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి వరదతో కోనసీమలోని గౌతమి, వశిష్ట, వైనతేయ నదీపాయలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాల ప్రజలు వరద ముంపులోనే తీవ్ర అవస్థలు పడుతున్నారు.స్థిరంగా శ్రీశైలం వరద ప్రవాహం: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులో 3,21,764 క్యూసెక్కులు చేరుతుండగా 3,63,043 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,288 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 10 స్పిల్ వే గేట్లను 10 అడుగులు ఎత్తి 2,67,440 క్యూసెక్కులు నాగార్జునసాగర్?కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 199.73 టీఎంసీలుగా కొనసాగుతోంది

# విశాఖ - అందుబాటులోకి అత్యాధునిక వైద్యసేవలు! -



దాదాపు రూ.100 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, వైద్య సంబంధిత సేవలు - తుదిదశ నిర్మాణంలో 50 పడకల ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి పారిశ్రామిక, ఐటీ రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో అత్యాధునిక వైద్యసేవలెన్నో అందుబాటులోకి రానున్నాయి. సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా దాదాపు రూ.100 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, వైద్య సంబంధిత సేవలు విస్తృతం కానున్నాయి. ఫార్మాసిటీ, మెడ్‌టెక్ జోన్, హెల్త్‌సిటీ తదితరాలతో దేశంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న విశాఖ నగరం త్వరలో 'హెల్త్ హబ్'గా మారనుంది.తొలి ప్రకృతి వైద్య కళాశాల : రాష్ట్రంలో తొలి ప్రకృతి వైద్య కళాశాల నిర్మాణం విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల ప్రాంగణంలో జరుగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం 2016-17లో దీనికి ఆమోదం తెలిపింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగా సైన్సెస్ (బీఎన్‌వైఎస్) కోర్సులో 50 సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి అనుబంధంగా 50 పడకలతో ప్రకృతి ఆసుపత్రి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.ఆయుర్వేద మందుల తయారీ : హనుమంతవాక దగ్గర విమ్స్ ప్రాంగణంలోని ప్రకృతి వైద్య కళాశాల పక్కనే 50 పడకల ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి నిర్మాణం తుదిదశలో ఉంది. అందులో ఆయుర్వేద, యునానీ, హోమియో వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.శొంఠ్యాంలో రూ.6 కోట్లతో ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగశాల ఏర్పాటు కానుంది.ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఆహార పరీక్షల ప్రయోగశాల కొద్దిరోజుల్లో అందుబాటులోకి రానుంది.వైద్యులు లేరు, మందులు ఉండవు - మూతపడుతున్న ఆయుష్ కేంద్రాలురసాయన ప్రమాదాలు జరిగితే : విమ్స్ ప్రాంగణంలో సెకండరీ లెవెల్ కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు గతేడాది నవంబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. రియాక్టర్ పేలుళ్లు, గ్యాస్ లీకేజీలు, రసాయనాల విస్ఫోటం వంటివి జరిగినప్పుడు క్షతగాత్రులకు ఈ కేంద్రంలో మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుంది. రెండంతస్తుల్లో దాదాపు రూ.15 కోట్లతో ఈ కేంద్రాన్ని నిర్మించనున్నారు. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలను కేటాయించడంతోపాటు సిబ్బందిని కేంద్రమే నియమిస్తుంది.గిరిజనుల్లో జన్యు పరీక్షలకు : గిరిజనుల్లో సికిల్‌సెల్ ఎనీమియా తీవ్రత ఎక్కువగా ఉంది. మరో 25 ఏళ్లలో ఈ వ్యాధిని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం జాతీయ సికిల్‌సెల్ నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. గిరిజనుల ఆరోగ్య సంరక్షణకు కేజీహెచ్ ఆవరణలోనే రూ.4 కోట్లతో జన్యు పరీక్షల ప్రయోగశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. మరో 3 నెలల్లో ఇక్కడ జన్యు నిర్ధారణ పరీక్షలు జరిగే అవకాశముంది. అలాగే గర్భిణులకు ప్రసవానికి ముందు కౌన్సెలింగ్ చేయడంతోపాటు నవజాత శిశువులకు స్క్రీనింగ్, టెలి కన్సల్టేషన్ సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి.ఉచితంగా క్యాన్సర్? సేవలు : మరోవైపు నగరంలోని కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) రేడియో థెరపీ విభాగంలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులు, అగనంపూడిలోని హోమీబాబా ఆసుపత్రిలో అందిస్తున్న క్యాన్సర్ సేవల్ని ఇక్కడ రోగులకు ఉచితంగా అందించేందుకు విభాగం సిద్ధమైంది.అటు వైద్యం ఇటు బోధన : ఇటీవల కూటమి ప్రభుత్వం కేజీహెచ్?లో రూ.40 కోట్ల విలువైన మూడు కీలక వైద్య పరికరాలను ఆసుపత్రికి సమకూర్చింది. వాటిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వచ్చే రోగులతో పాటు పేద రోగులకు ఇక్కడ వైద్యం చేయనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు అన్ని రకాల ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారిణి డాక్టర్ ఐ. వాణి తెలిపారు.నూతన పరికరాల ద్వారా మానవ శరీరంలో ఏ విభాగానికి క్యాన్సర్ వచ్చినా, మెరుగైన వైద్యం అందించేందుకు సాధ్యపడుతుంది. ప్రస్తుతం టెలీ కోబాల్ట్ యంత్రంతో రేడియేషన్ చికిత్స అందిస్తున్నామని, ఆ స్థానంలో ఇప్పుడు కొత్తవి సమకూరాయని డాక్టర్ వాణి పేర్కొన్నారు. రేడియో థెరపీ విభాగంలో చికిత్సతో పాటు పీజీ కోర్సులు బోధించనున్నారు. ఈ విభాగంలో ప్రస్తుతం ఏడుగురు పీజీలు, ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్, ఇద్దరు సహాయ ప్రొఫెసర్లు ఉన్నారు.బ్రాకో థెరపీ యూనిట్ : దీని ద్వారా ఐసీఆర్ (ఇంట్రా కేవిటీ రేడియేషన్), ఐఎల్ఆర్టీ (ఇంట్రా లూమినాల్ రేడియో థెరపీ), ఐఎస్‌బీటీ (ఇంటర్ స్టీటియల్ బ్రాచి థెరపీ), మెల్డ్ థెరపీ సేవలు అందిస్తారు.లీనియర్ యాక్సిలరేటర్: 3డీ సీఆర్టీ (3 డైమెన్షనల్ కన్ఫార్మల్ రేడియో థెరపీ, ఐఎంఆర్టీ (ఇంటెన్సిటి మాడ్యులేటెడ్ రేడియేషన్ థెరపీ), ఐజీఆర్టీ (ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీ), బ్రెయిన్ ట్యూమర్స్ కోసం ఎస్ఆర్ఎస్ (స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీ), ఎస్‌బీఆర్టీ (స్టీరియోటాక్టిక్ బాడీ రేడియో థెరపీ) చికిత్సలు చేయనున్నారు

# 24 నుంచి తిరుమల బ్రహ్మోత్సవాలు - ఏ రోజున ఏ వాహన సేవంటే! -




నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాలు - ప్రతిరోజు ఉదయం 8-10 వరకు, సాయంత్రం 7-9 గంటల వరకు వాహన సేవలుతెలుగు వారికి ఎంతో ఇష్టమైన దైవం, ఎంతోమందికి కులదైవం శ్రీ వేంకటేశ్వరుడు. అందుకే ఏడాదిలో ఒకసారైనా శ్రీనివాసుడిని దర్శించుకోవాలని భక్తులు కోరుకుంటుంటారు. ఇక చాలామంది తాము కోరుకున్న కోరికలు నెరవేరితే వెంటనే స్వామివారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. అందుకే ఏడాది పొడవునా తిరుమలగిరులు గోవిందనామాలతో మారుమ్రోగుతుంటాయి. ఇక బ్రహ్మోత్సవాల సమయంలో అయితే ఎక్కడెక్కడో ఉన్నవారు కూడా తిరుమలకు వస్తుంటారు. వేంకటేశ్వర స్వామిని సేవించుకునేందుకు ఆ బ్రహ్మదేవుడే ఈ బ్రహ్మోత్సవాలను మొదలు పెట్టినట్లు శాస్త్రాలు చెబుతున్నాయి.ఇక ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 23వ తేదీన సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 16వ తేదీన శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8-10 గంటల వరకు, సాయంత్రం 7-9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి.వాహన సేవల తేదీలు, ఇతర వివరాలు:సెప్టెంబర్ 24న సాయంత్రం 5:43 నుంచి 6:15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహన సేవ నిర్వహించనున్నారు.ఎప్టెంబర్ 25న ఉదయం 8:00 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1:00 నుంచి 3:00 గంటల వరకు స్నపనం, రాత్రి 7:00 గంటలకు హంస వాహన సేవ ఉంటుంది.ధ్యాహ్నం ఒంటి గంటకు స్నపనం, రాత్రి 7:00 గంటలకు ముత్యపు పందిరి వాహన సేవ.సెప్టెంబర్ 27న ఉదయం 8:00 గంటలకు కల్పవృక్షం వాహన సేవ, మధ్యాహ్నం 1:00 గంటకు స్నపనం, రాత్రి 7:00 గంటలకు సర్వ భూపాల వాహన సేవ.సెప్టెంబర్ 28న ఉదయం 8:00 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి వరకు గరుడ వాహన సేవ.సెప్టెంబర్ 29న ఉదయం 8:00 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4:00 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7:00 గంటలకు గజ వాహన సేవ నిర్వహిస్తారు.సెప్టెంబర్ 30న ఉదయం 8:00 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 7:00 గంటలకు చంద్రప్రభ వాహన సేవ.అక్టోబర్ 1న ఉదయం 7:00 గంటలకు రథోత్సవం, రాత్రి 7:00 గంటలకు అశ్వ వాహన సేవ.అక్టోబర్ 2న ఉదయం 6:00 నుంచి 9:00 వరకు చక్రస్నానం, రాత్రి 8:30 నుంచి 10:00 గంటల వరకు ధ్వజారోహణం.బ్రేక్ దర్శనాలు రద్దు: బ్రహ్మోత్సవ జరిగే రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలు సైతం రద్దు కానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 వరకు, సాయంత్రం 7 నుంచి 9 వరకు వాహన సేవలు జరగనున్నాయి. విజిలెన్స్, పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్ మ్యాప్?లు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.వాహనాలకు అనుమతి నిరాకరణ: 27 రాత్రి 9 గంటల నుంచి 29 ఉదయం 6 గంటల వరకు తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదు. బ్రహ్మోత్సవాలు జరిగే సమయాల్లో భక్తులకు దర్శన క్యూలైన్లు, మాడ వీధుల్లోని గ్యాలరీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. భక్తుల అవసరాలకనుగుణంగా పలు పనులు చేపడుతున్నారు. గ్యాలరీల్లో భక్తులకు సమస్యలు తలెత్తకుండా, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేందుకు అదనపు సిబ్బందిని తీసుకోనున్నారు

# వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం : సీఎం రేవంత్ రెడ్డి -



వరదల ప్రభావంపై కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ - గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి కేంద్రం నుంచి నిధులు రాకపోవడంపై ఆరా గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి కేంద్రం నుంచి నిధులు రాకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించించారు. వరదల ప్రభావంపై కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కొనసాగుతుంది. భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాలి : తెలంగాణ రాష్ట్రంలో చెరువుల పరిస్థితిపైన సమగ్ర అధ్యయనం చేయాలని, విపత్తు నిర్వహణ నిధులతో చేపట్టిన పనుల వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల జరిగిన పంట నష్టం అంచనా వేసి వెంటనే నివేదిక ఇవ్వాలని, ఎస్డీఆర్ఎఫ్ వరదల సమయంలో బాగా పని చేసిందని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్?తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాలని తెలిపారు.హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల నోటిఫై చేయాలి : రాష్ట్రంలో వర్షాల వల్ల 1052 చోట్ల 1023 కిలోమీటర్ల మేరకు రోడ్లు దెబ్బతిన్నాయని సీఎంకు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న రోడ్లపై సమగ్ర నివేదిక తయారు చేయాలని, హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల నోటిఫై చేయాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశించారు.కేంద్రానికి నివేదిక పంపాలి : వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని, జంతువులు చనిపోతే రైతులకు పరిహారం ఇవ్వాలని రేవంత్ రెడ్డి చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని,కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాల్లోనే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కిందిస్థాయి అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విపత్తు నిర్వహణపై సమగ్ర నివేదిక చేసి కేంద్రానికి పంపాలని ఆదేశించారు.

# ఆ నంబర్స్ నుంచి? కాల్? వస్తే తప్పకుండా కేటుగాళ్లే - 'రిక్విన్'?తో సైబర్? నేరాలకు చెక్!



చైనా ముఠాలు కంబోడియా,లావోస్?, మయన్మార్?లతో కూడిన గోల్డెన్? ట్రయాంగిల్?ప్రాంతంలో ప్రత్యేకంగా కాల్ ?సెంటర్లు ఏర్పాటు చేసి మరీ సైబర్? మోసాలకు పాల్పడుతున్నారు. భారత్?లోని కొన్ని ప్రాంతాల్లో వాయిస్? ఓవర్?ఇంటర్నెట్? ప్రోటో కాల్?లతోకూడిన సిమ్?బాక్స్? సెటవ్?లనుఅక్రమంగా ఏర్పాటు చేస్తున్నారు. గోల్డెన్ ట్రయాంగిల్ నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌ను ఈ సెటప్‌ల ద్వారా లోకల్ కాల్స్‌గా మార్చుతున్నారు. సీబీఐ, ఈడీ, ముంబయి పోలీస్ తదితర దర్యాప్తు సంస్థల నుంచి ఫోన్ చేస్తున్నట్లు, మీపై కేసు నమోదైనట్లు, డిజిటల్ అరెస్ట్ చేసినట్లు డబ్బులకు బెదిరిస్తున్నాయి. చర్యలు తీసుకోకుండా ఉండాలంటే వెంటనే రూ.లక్షలు పంపండి అంటూ డిమాండ్ చేస్తున్నాయి. మొదటగా కాస్త వారిని నమ్మించే విధంగా అడిగినా, తర్వాత అది బెదిరింపుల వరకు వెళ్తుంది. పెట్టుబడులపై అధిక లాభాల పేరుతోనూ సైబర్ మోసగాళ్లు రూ.కోట్లు కొట్టేస్తున్నారు. ఈ మోసాలన్నీ విదేశాల నుంచే జరుగుతున్నాయి.ఇలా మొదలెట్టి అలా డబ్బులు దోచుకుని : ముఖ్యంగా ఈ తరహా కేసుల్లో ఎక్కువగా వృద్ధులనే టార్గెట్? చేస్తున్నారు. ముందుగా కాల్? చేస్తారు. మీ పేరుపై గ్రహిస్తే సైబర్? అఫీషియల్? వెబ్?సైట్?లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# మనసు.. కవిత్వం



కట్టుబాట్లను వదిలేసినప్పుడు సంతోషంగా ఉన్నా, తర్వాత సమాజం నుంచి వచ్చే విమర్శల వల్ల దుఃఖమూ కలుగుతుంది. మనసు ఒక్కోసారి ఆకాశంలో విహరిస్తున్నట్టుగా, ఒక్కోసారి దుఃఖపడుతూ, ఒక్కోసారి నిస్తేజంగానూ, నిరుత్సాహంగానూ ఉంటుంది. మన మనసు ఎలా ఉంటే, ఆ భావం ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఒక మనిషి చెడ్డవాడా, మంచివాడా అనే నిర్ణయం మనసును బట్టే ఉంటుంది. అందుకే, ఎందరో వాగ్గేయకారులు, గేయ రచయితలు ఎంతో అనుభవంతో, మనసును సంబోధిస్తూ రచనలు చేశారు. భారతీయ సంగీతంలో, వివిధ సాహిత్య రీతుల్లో మనసును సంబోధిస్తూ అనేక రచనలు చోటుచేసుకున్నాయి. మనసుకు ఒక రూపం అంటూ లేదు. కానీ, మన ఇంద్రియాలకు మాత్రం అధికారి మనస్సే. మనం ఏ పనిచేసినా, అది మనసుతో ముడిపడి ఉంటుంది. మనిషి పురోగతికి, తిరోగతికీ మనసే కారణం. అందుకే అది స్వేచ్ఛగా తిరగాలని, కట్టుబాట్లను వదిలేయాలని చూస్తుంది. మనసు, దాని స్వరూప స్వభావాలు, జీవితంలో ఎదురయ్యే వివిధ సందర్భాల్లో మనసు తీరుతెన్నులు ఎలా ఉంటాయో అనుభవపూర్వక రచనల సాహిత్యాలను పరిశీలించి తెలుసుకుం దాం. భారతీయ సంగీతంలో మనసును సంబోధిస్తూ వెలువడిన వివిధ రీతులైన శాస్త్రీయ, భక్తి, లలిత, జానపద, చలనచిత్ర సంగీతాలు ఎలా ఉన్నాయో, ఆయా రచనల భావం, ఆ రచనల్లో గల సాహిత్య విలువలను ఒకసారి సింహావలోకనం చేద్దాం.

### మొదటగా శాస్త్రీయ సంగీతం...

సామవేద జనితమైన శాస్త్రీయ సంగీతం హిందుస్తా నీ, కర్ణాటక సంగీత బాణీలుగా ఉన్నది. వీటిలో కర్ణాటక సంగీతం, మన దక్షిణ భారతానికి చెందిన ది. ఈ సంగీత రీతిలో మనసు మీద రచనలు ఎక్కువగా తెలుగులో తర్వాత సంస్కృతం, హిందీ, తమి ళం, కన్నడం వంటి ప్రాంతీయ భాషల్లో వచ్చాయి. 18వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారులైన త్యాగ య్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు కర్ణాటక సం గీతానికి త్రిమూర్తులు. వీరికృతులు, కీర్తనలు, రచనలు, నేటి శాస్త్రీయ సంగీతం అనేంతగా సంగీత ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. ఈ ముగ్గురిలో త్యాగరాజ స్వామి రచనలు అప్పటి సామాజిక పరిస్థితులకు దగ్గరగా ఉం డటం వల్ల విశేష ఆదరణ పొందాయి. త్యాగరాజు రామభక్తుడు. వూంఛవృత్తి చేస్తూ జీవనం గడిపేవాడు. ఐహిక సుఖములను వదిలి రాముని పరబ్రహ్మగా భావించి నాదోపాసన ద్వారా తరించాడు. ఆయన కృతులలో మనసును సంబోధిస్తూ, మనసుకు వివిధ విషయాల గురించి బోధిస్తూ సాగే రచనలుఎక్కువగా ఉన్నాయి. 'మనసా ఎటులోర్తునే, నా మనవిని చేకొనవే/ దినకరకుల భూషణుని' అంటూ మనసును చెడు స్నేహాలు చేయకుండా, తరింపజేసే మార్గం తెలుపమంటూ వేడుకుంటున్నట్టుగా సాగుతుందీ పాట. 'అలాగే, ఉండేది రాముడొకడు/ ఊరక చెడిపోకే మనసా/ ధర్మాత్ముడు, సర్వసముడు క్షేమకరుడు త్యాగరాజ చిత్తహితుడు/ జగము నిండి' అనే ఈ కీర్తనలో సగుణ రూపుడైన రాముడికి, నిర్గుణమైన పరబ్రహ్మ తత్వాన్ని ఆపాదించి మనసుకు బోధించడం కనపడుతుంది. ఈ కీర్తన 28వ మేళకర్త హరి కాంభోజి రాగంలో ఉన్నది. ఈ రచనలు శాస్త్రీయ సంగీతంలో మచ్చు తునకలు.

### భక్తి సంగీతంలో..

మన భారతీయ జీవనశైలిలో దేవునిపై భక్తి చాలా ఉంటుంది. అయితే, మనిషి ఏ మార్గంలో నడవాలన్నా దానికి మనసు సహకరించాల్సిందే. చిన్నప్పటి నుంచి రామభక్తుడైన త్యాగయ్య 'మనసు స్వాధీనమైన/ ఆ ఘనునికి/ మరి మంత్రతంత్రములేల?' అన్నాడు. అంటే, మనసు సహకారం మనిషికి ఎంత ప్రధానమైనదో దీని ద్వారా తెలుస్తున్నది.

### రామదాసు కీర్తనల్లో!

తెలుగునాట భజనల్లో తప్పకుండా వినవచ్చేవి రామదాసు కీర్తనలు. కంచర్ల గోపన్న తన భక్తి రచనల ద్వారా భక్త రామదాసుగా పేరుగాంచారు. అయితే రామదాసు తన మనసుకు, కేవలం రామునిపై భక్తి, వైరాగ్యాలనే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా బోధించాడు. 'శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న చాలు ఘోరమైన తపములను / కోరనేటికే మనసా భాగవతుల పాదజలము/ పైన చల్లుకొన్న చాలు భగీరథికి పోయ్యేననే భ్రాంతి ఏటికే ' అంటూ ఒక చరణంలో, మరో చరణంలో సామాజిక బాధ్యతగా%ో% 'పరుల హింస చేయకున్న /పరమ ధర్మమంతె చాలు/ పరుల రక్షింతునని/పల్క నేటికే దొరకాని పరుల ధనముల దోచక ఉండితె చాలు గురుతుగాను గోపురము, కట్టనేటికే మనసా' అంటూ ఘోరమైన తపస్సులు చేయవలసిన అవసరం లేదని, మహాభక్తుల పాద జలము చాలు, గంగానది వద్దకు వెళ్లనవసరం లేదనీ చాలా చక్కగా చెప్పారు. అలాగే పరాయివాళ్ల ధనం మీద ఆశపడి వాటిని దోచి పేరు రావడానికి గుడి గోపురాలు కట్టించినా నిష్ఫలమని సామాజికపరంగా అందరికీ కనువిప్పు కలిగించే విధంగా కీర్తనలు చేశారు. మనసుకీ, మనిషికీ మార్గనిర్దేశనం చేయగల ఈ కీర్తన, సాహిత్యపరంగా రామదాసుచే కావించబడిన ఒక గొప్ప మానస సంబోధన.

### లలిత సంగీతం...

గ్రామ ఫోన్ రికార్డులు, రేడియోల ద్వారా జనంలోకి చేరిన సంగీత రీతి లలిత సంగీతం. శాస్త్రీయ సంగీతానికి భిన్నంగా నూతనంగా ఉండే ఈ లలితగీతాలు సంగీతం, ప్రకృతి, ప్రేమా, భక్తి వైరాగ్యం దాకా స్పృశించని అంశం లేదు. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది. లలిత సంగీత లక్షణాన్ని బాలాంతరపు రజనీకాంతరావు ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర రెండవ భాగంలో చెప్పారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బసవరాజు అప్పారావు, నండూరి వెం కట సుబ్బారావు, బాపిరాజు, బాలాంతపు రజనీకాంతరావు వంటి రచయితలు.. విశ్వనాథ, సాలూరి రాజేశ్వరరావు, చిత్తరంజన్ వంటి స్వరకర్తలు.. ఘంటసాల, బాలమురళికృష్ణ, బాల సరస్వతి, అనసూయ, సుశీల, శ్రీరంగం గోపాలరత్నం వంటి గాయక శిఖామణులు లలిత సంగీతానికి పరిపుష్టిని చేకూర్చారు. మల్లవరపు విశ్వేశ్వర రావు రచించిన ఒక మానస బోధగేయం%ో% 'మరపురాని కలలు కని, మరుదినమ్ము మేలుకొని నిరాశలే/ మిగులునని తెలుసుకొంటివా మనసా/ అలసి యుంటివా మనసా ప్రేమ నిన్న రోజుదని/ నేడు కరిగిపోయెననీ/ వేదనయే రేపటనీ తెల్ల మాయెనా! గుండెలు తల్లడిల్లెనా! మనసా! అలసటా యెనా మనసా!' అంటూ ప్రేమలో విఫలమైనప్పుడు మనసు పడే బాధను చక్కగా వివరిస్తుంది. ఒకరిపై ప్రేమ కలగాలన్నా లేదా ఏ విధమైన భావన కలగాలన్నా మనసుదే కీలకపాత్ర. కనుక ఈ గీతంలో ప్రేమ విఫలమైనప్పుడు కలిగే బాధను మనసే పడుతున్నట్టు భావించి కవి ఈ గీతాన్ని రాశారు. అలాగే కృష్ణశాస్త్రి కూడా 'ఒదిగిన మనసున, పొదిగిన భావం' అన్న లలితగీతానికి ఈమని శంకరశాస్త్రి సంగీతం సమకూర్చారు.


### జానపద సాహిత్యంలో

జానపద సంగీతం, సాహిత్యం పల్లె ప్రజల్లో అసువుగా పుట్టాయి. వీటికి సాధారణంగా రచయితలుండరు. ఉన్నా తెలియదు. పల్లెల్లో బుర్రకథలు, హరిదాసులు, యాచకుల వద్ద మనకు వినిపిస్తూ ఉంటాయి. ఇటువంటి వాటిలో ఎక్కువగా మనసుకు సంబంధించిన జ్ఞాన, వైరాగ్యాలను చూపే తత్వసాహిత్యం ఉంటుంది. 'ఇల్లు వాకిలి నాది ఇల్లాలు నాదనచు ఏల భ్రమసితివయ్య మనసా! కాలుని వలలోన/కానక చిక్కితివి కడతేరుటే త్రోవమనసా ఒంటరిగ యాగంటి దాసుని మదిలోన జంట బాయక వుండు మనసా' అంటూ సాగిన జానపద గేయం యాగంటి లక్ష్మప్ప రాసిన గేయంగా, 'ఆంధ్రుల కీర్తన వ్మాయ కళాసేవ' అని ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గ్రంథంలో ఉన్నది. ఇటువంటి జానపద గేయాలు జ్ఞాన భాండాగారాలు. తర్వాతి తరాలవారి కోసం వీటిని భద్రపరచడం మన బాధ్యత.

### చలనచిత్ర సంగీతం..

మనసు గురించి పద్యాలతో ప్రారంభమై, నవరసాలను కురిపిస్తూ, అనేక రీతులను తనలోకి తీసుకుంటూ శాస్త్రీయ, లలిత, జానపద సంగీతాలకు దీటుగా చలనచిత్ర సంగీతం ఆవిర్భవించింది. సినీ గేయ రచయితల లో ఒకరైన ఆత్రేయకు మనసు కవి అని పేరు. మనసునే ప్రధాన కవితా వస్తువుగా తీసుకొని ఆయన ఎన్నో పాట లు రాశారు. వాటిలో మనసు స్వరూపాన్ని, స్వభావాన్నీ చక్కగా చూపిన ఈ పాట 'గుప్పెడు మనసు' లోనిది. 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా తలపులు ఎన్నెన్నో కలలుగా కంటావు కల్లలు కాగానే కన్నీరు అవుతావు చీకటి గుహ నీవు చింతల చెలి నీవు నాటక రంగానివే మనసా/ ఎందుకు వలచేవో /ఎందుకు వగచేవో'.. ఎందుకు రగిలేవో మనసా' అని ఈ పాట సాగుతుంది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన ఈ పాట ప్రేక్షకుల మనసును దోచుకున్నది. నిజానికి, అనుకూల పరిస్థితుల్లో కంటే ప్రతికూల పరిస్థితుల్లోనే మనసు ఉనికిని గుర్తిస్తాం. ఇలా క్షణిక ఆనందాల వైపు తిరిగే మనసును, దాని స్వభావాన్ని ఎత్తి పొడుస్తూ, బతిమాలుతూ, ప్రేమ, ఆనందం, బాధ కలబోస్తూ, మనసు మీద రాసిన కవిత్వం, సాహితీ ప్రపంచంలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నది. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది.


# తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక




వాన వెలిశాక మట్టి వాసన, ఆరుద్ర పురుగుల సర్కస్ ఫీట్లు, పిచ్చుకల మట్టి స్నానాలు, వెన్నెల్లో ఆడిన ఆటలు, ఎండకాలం బావుల్లో ఈతలు ఈనాడేవి? మన చిన్నతనం మనకు చిన్నతనం కాదు. బాల్యం మళ్లీ రమ్మంటే వస్తుందా? 'అనుభూతులను పోగొట్టుకున్న గుండె ఎడారి. అనుభూతులను పదిలపరచుకున్న గుండె సతత హరితారణ్యం'. ఇటువంటి మధురమైన భావాల సుమమాల డాక్టర్ నలిమెల భాస్కర్ 'సుద్దముక్క'. ఈ పుస్తకంలో శ్రామిక జనజీవన చిత్రణం ఆర్ద్రంగా ఉంటుంది. శ్రామికుల రుణం తీర్చుకోవాలనిపించేలా చేస్తుంది. తమ బతుకులను బండలకేసి బాదుకుంటూ మన బట్టలను గట్టున ఆరేస్తారు రజకులు. మన బట్టలను పిండి వాళ్లు తోలు బొమ్మలవుతారు. వాళ్లుతికిన దుస్తులతో మనం మన లోపలి ముఖాన్నీ, మురికినీ చాటు చేసుకొని రోజూ నాగరికులమవుతాం. ఎవరి బట్టలను వారికి, తప్పిపోకుండా అందించే అమోఘమైన జ్ఞాపకశక్తి వారిది. 'సమాజ కల్మషాన్ని కడిగివేయడానికి/ కంకణధారులైన వ్యక్తులు సంస్కర్తలైనప్పుడు/ తరతరాలుగా మైలబట్టల్ని/ మల్లెపూలు ఉల్లిపొరలూ చేసేందుకు/ కటి బద్ధులైన వీళ్ళూ సంస్కర్తలే'. ఇలాంటివన్నీ ఒక ఎత్తు అయితే.. ఉపాధ్యాయుని గురించి, సుద్దముక్క గురించి రాసిన ఆరు కవితలు మరొకెత్తు. ఆ ఆరు కవితలలో ఉపాధ్యాయున్ని ప్రపంచాన అగ్రభాగాన నిలిపారు నలిమెల. అధ్యాపకునికి అక్షరాభిషేకం చేశారు. 'అతడు కాలుమోపడం తోటే అణువణువూ అక్షరమవుతుంది/ అతని మాటల రెక్కల మీద/ పిల్లలు అత్యంత సురక్షితంగా/ జ్ఞాన విహాయసంలో విహరించి వస్తారు' అని ఉపాధ్యాయుడి ఔన్నత్యాన్నీ, 'క్లాసులో ప్రవేశిస్తున్న ప్రతిసారీ/ అతని కుడిచేతికి ఆరో వేలు/ అదనంగా మొలుస్తుంది/ అది కచ్చితంగా జ్ఞానం ఘనీభవించిన తెల్లని సుద్దముక్కే' అని చాక్‌పీస్ ప్రాధాన్యాన్ని వెల్లడిస్తారు. సుద్దముక్క సూర్యగోళం నుంచి కోసుకొచ్చిన రశ్మి శకలం. చందమామ నుంచి తీసుకొచ్చిన వెన్నెలగడ్డ అన్నప్పుడు భాస్కర్ కవిత్వం తారస్థాయికి చేరుతుంది. సౌందర్యోపేతం అవుతుంది. చాక్‌పీస్ విద్యార్థులకు 'సమస్తమైన దిక్కులను నిర్దేశించగల చుక్కాని/ తరగతికి వెళ్లే ఉపాధ్యాయునికి ఊపిరి గుళిక/ ఉపన్యాసకులకు ఊతకర్ర'. భాస్కర్ దృష్టిలో ఈ భూమండలం మీద ఏకైక లోకైక దర్శనీయ స్థలం 'బడి'. 'సుద్దముక్క' తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక. ఇందులో అడుగడుగునా కవిత్వం, అణువణువునా నవత్వం, ప్రతివాక్యం ఆస్వాదయోగ్యం, అనుభవైకవేద్యం.

# ఏది తల్లీ గట్టుంటది నాటి సాహిత్యం

## ఏదీ ఎక్కడా కానరావేం మన దగ్గరనే కాదు



పొరుగునే అని కూడా కాదు, మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా ఆ ఉధృతి తగ్గింది. వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్న కవిత్వమే తప్ప సామాజిక పట్టింపు ఎక్కడా కానరాదేం. ముఖ్యంగా మహిళలు రాసే కవిత్వం ప్రేమ రాహిత్యం, వ్యక్తిగత వైఫల్యాలపై వస్తున్నాయే తప్ప సామాజిక, సామూహిక వైఫల్యాలపై ఎందుకు నిరసన కవిత్వం రావడం లేదు. ఆనాటి ఆవేశం నేడు ఎక్కడా కానరావడం లేదేం? ఆనాడు వచ్చిన ఫెమినిస్ట్ కవిత్వం నేడు ఎందుకు రావడం లేదు? ఆనాటి ఫెమినిస్టులు తమ తర్వాత తరానికి ఆ ఆయుధాలను ఇవ్వలేకపోవడమా లేక ఈనాటి కవయిత్రులు ఆ తరాన్ని అందుకోలేకపోవడమా అసలు కారణమేంటి? ఒకరిద్దరు మినహా మిగిలిన కవయిత్రులంతా తమ కవిత్వాన్ని వ్యక్తిగతానికే పరిమితం చేస్తున్నారు. ఆ రోజులతో పోలిస్తే నేడు కవిత్వ ప్రకటనలకు అనేకానేక వేదికలున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో కవిత్వం ఏరులై పారుతున్నది. నిజానికి పత్రికలు కవిత్వానికి ఇస్తున్న స్పేస్ చాలా అంటే చాలా తగ్గిపోయింది. కొన్ని పత్రికలైతే అసలు సాహిత్యం ఓ ఆలంబన అనే విషయాన్నే వదిలేసి ఏండ్లు గడిచిపోయాయి. మిగిలిన సామాజిక మాధ్యమాల్లో కూడా సామాజిక అంశాలపై కవిత్వం రాస్తున్న వారు పెద్దగా కానరావడం లేదు. 80, 90వ దశకాల్లో మహిళలు రాసిన కవిత్వం చదివి చాలామంది ప్రేరణ పొందారు. ఆ కవిత్వాల ద్వారానే కొన్ని ఉద్యమాలు వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నీలిమేఘాలు కవిత్వ సంపుటి తీసుకొచ్చిన తుఫాను.. అలాంటి ఇలాంటి తుఫాను కాదు. అంతవరకూ వ్యక్తులుగా ఉన్న కవయిత్రులంతా ఆ నీలిమేఘాలు అనంతరం సామూహికం అయ్యారు. అందులో ఒక్కో కవితా ఒక్కో తూటాలా మహిళలను కదిలించింది. పురుషులైతే ఇలా ఉన్నామా ఇలా బతుకుతున్నామా? అని తమని తాము ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది. అప్పటికింకా చదువు, సంధ్యల్లో గడుపుతున్న నాలాంటి వాళ్లకు నీలిమేఘాలు ఓ సంచలన, సంభ్రమాశ్చర్య కవిత్వ సంపుటి. ఆ సమయంలో ఓల్గా, విమల, జయప్రభ, ఘంటశాల నిర్మల, మందరపు హైమవతి, కొండేపూడి నిర్మల వంటి వారి కవిత్వం చదివి ఉప్పొంగిపోయిన సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఆ కవయిత్రుల్లో కొందరు పూర్తిగా కవిత్వానికి దూరమయ్యారు. మిగిలినవారు రాస్తున్నా ఆ నాటి వాడి, వేడి ఎందుకు తగ్గిందో? మహిళలందరూ.. 'ఎవరి బతుకులు వారివే. మనకెందుకు ఇదంతా' అనే ఓ నిర్లిప్త వాతావరణంలోకి వెళ్లిపోయారా? సామూహికంగా మారి ఓ ఉద్యమ స్థాయిలో కవిత్వాన్ని పండించినవారంతా ఇప్పుడు ఒక్కరుగానే మిగిలిపోతున్నారా? అప్పట్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. దానికి తోడు సమాజంలో ఓ చిన్నచూపు. కానీ, నేడు పరిస్థితులు కొంత మారాయి. ముఖ్యంగా దేశంలో గ్లోబలైజేషన్ కారణంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. ఐటీ ప్రవేశంతో జీవితాలు మారిపోయాయి. స్త్రీలకు తాము చదివిన చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన పెరిగింది. పురుషుడితో సమానంగా తానూ ఎదిగాననే ఆత్మవిశ్వాసం వచ్చింది. లక్షల్లో జీతాలతో పాటు తన కోర్కెలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాలు వచ్చాయి. దీని ప్రభావం సాహిత్యం మీద పడిందా? ఇవన్నీ ప్రశ్నలే. జీవితం సంతృప్త స్థాయికి చేరిందనుకోవాలా? అందుకే వ్యక్తిగత వ్యవహారాలకే నేటి కవయిత్రులు పరిమితమవుతున్నారని భావించాలా? ఇదంతా కావచ్చు కానీ నా మటుకు నాకు అనిపించింది ఏమిటంటే.. ఓ కేంద్రీకృత ఉద్యమం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అసలు ఉద్యమం అనేదే లేకుండాపోయింది. కథకుడు ఖదీర్‌బాబు చెప్పినట్టు 'కనీసం ఊళ్లు పట్టుకు ఊరేగడానికి ఉద్యమమూ లేదు' అన్నట్టుగా మారింది. అమ్మ నవలలో 'పావెల్ చేత మన ఆలోచనలన్నింటికీ కేంద్రం ఉద్యమమే కావాలి' అని మాక్సిం గోర్కీ చెప్పిస్తాడు. ఆ కేంద్ర స్థానాన్ని, ఆ ఉద్యమాన్ని ఇక్కడివారు పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరుగుతోందా? రాష్ట్రం విడిపోవడానికి ముందు తెలంగాణ సాధన కోసం అనేక మంది కవయిత్రులు ఉద్యమ కవిత్వాన్ని అద్భుతంగా రాశారు. దాని ప్రభావం కచ్చితంగా ఉద్యమంపై పడి అది మరింత బలపడింది. కవిత్వమో, పాటో, కథో, నవలో మొత్తానికి తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా, ప్రత్యేక రాష్ట్రం రావాల్సిన ఆవశ్యకతపై సాహిత్య సృజన జరిగింది. రాష్ట్రం సిద్ధించింది. చిరకాల కోరిక ఈడేరింది. ప్రాంతీయ ఉద్యమాలే ఆలంబనగా ఆ సాహిత్యం వచ్చింది. అయితే, ఆ తర్వాత అంతే ఉద్యమ, సామాజిక స్ఫూర్తిని ఇవ్వాల్సిన సాహిత్యం కూడా నిలిచిపోయిందా. ఇప్పుడూ కవయిత్రులు రాస్తున్నారు కదా అనే ప్రశ్న రావచ్చు. వస్తోంది. ఆ కాలంతో పోల్చుకుంటే చాలా తక్కువగానే రాస్తున్నారు. తాము స్పందించకపోతే ఎలా అనే కారణంగానే ఒకటి, రెండు రాస్తున్నారు. ఎక్కువగా మాత్రం కవయిత్రులు తమ వ్యక్తిగతానికే పరిమితం అవుతున్నారని అనిపిస్తున్నది. అంతకుముందు ఉమ్మడి ఏపీలో వచ్చిన అనేకానేక ఉద్యమాలకు స్ఫూర్తి ఆ నాటి సాహిత్యమే. ఆ తర్వాత వచ్చిన పరిణామాల ప్రభావం సాహిత్యంపై పడటమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇప్పుడు రాస్తున్న కవయిత్రుల్లో చాలామంది అద్భుత కవిత్వాన్నే రాస్తున్నారు. కానీ, ఎక్కడో ఓ వెలితి వెంటాడుతోంది.

# రోజూ ఉదయం కడుపులో మంటగా ఉంటుందా అయితే ఈ చిట్కాలను పాటించండి



సాధారణంగా చాలా మంది అప్పుడప్పుడు అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కారం, మసాలాలు ఉన్న ఆహారాలను అధికంగా తినడం, వేళ తప్పించి భోజనం చేయడం, టీ, కాఫీలను అతిగా తాగడం, భోజనం ఎక్కువగా తీసుకోవడం వంటి అనేక కారణాల వల్ల అసిడిటీ వస్తుంది. దీంతో ఏం చేయాలో తోచదు. మెడికల్ షాపుకు వెళ్లి మందులను కొని తెచ్చి వేసుకుంటారు. అయితే దీర్ఘకాలంలో ఇలా చేయడం మంచిది కాదు. దీంతో పలు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఇక కొందరికి రోజంతా అసిడిటీ ఉండదు. కానీ ఉదయం పూట మాత్రం అసిడిటీ ఉంటుంది. ఇలాంటి వారు కింద చెప్పిన పలు చిట్కాలను పాటించడం వల్ల అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది.

### నిమ్మరసం..

అసిడిటీ సమస్యను తగ్గించడంలో నిమ్మరసం ఎంతగానో పనిచేస్తుంది. అయితే నిమ్మరసం కూడా యాసిడ్‌ను కలిగి ఉంటుంది కదా.. అని చాలా మంది అనుకుంటారు. కానీ నిజానికి నిమ్మరసాన్ని మనం తాగితే అది మన శరీరంలో చేరాక ఆమ్లత్వాన్ని కోల్పోతుంది. దీంతో మనకు మేలు జరుగుతుంది. కనుక అసిడిటీ సమస్య ఉన్నవారు నిరభ్యంతరంగా నిమ్మరసం తాగవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అజీర్ణం కూడా తగ్గుతుంది. ఇక ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసాన్ని సేవిస్తున్నా కూడా జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరచడంలో కలబంద ఎంతగానో పనిచేస్తుంది. కలబంద రసాన్ని సేవిస్తుంటే అసిడిటీ నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. దీంతోపాటు గ్యాస్, కడుపు ఉబ్బరం కూడా తగ్గుతాయి.

### సోంపు గింజలు..

ఉదయం అసిడిటీ ఎక్కువగా ఉంటే దాన్ని తగ్గించేందుకు సోంపు గింజలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. సోంపు గింజలను తీసుకుని నోట్లో వేసుకుని నమిలి తింటుంటే అసిడిటీ తగ్గుతుంది. లేదా సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుండవచ్చు. దీంతో కూడా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. రోజుకు రెండు సార్లు భోజనానికి ముందు అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో సేవించాలి. అల్లం రసం కడుపులో మంటను తగ్గిస్తుంది. పొట్టను ప్రశాంతంగా ఉండేలా చూస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యాన్ని కూడా తగ్గిస్తుంది.

### చల్లని పాలు..

వేడి పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం పెరుగుతుంది. కానీ చల్లని పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం తగ్గుతుంది. దీంతో అసిడిటీ నుంచి బయట పడవచ్చు. కనుక కడుపులో మంటగా ఉన్నప్పుడు వేడి పాలను కాకుండా చల్లని పాలను తాగితే మేలు జరుగుతుంది. కడుపులో రోజంతా మంటగా ఉండేవారు కొబ్బరినీళ్లను తాగుతుండాలి. దీంతో చక్కని ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులను నేరుగా అలాగే తింటున్నా కూడా కడుపులో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా పలు చిట్కాలను పాటించడం వల్ల కడుపులో మంటను తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.

# కలబందను అసలు ఎలా తీసుకోవాలి



ఆయుర్వేద ప్రకారం కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కలబందలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కలబంద గుజ్జును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. చాలా మంది ప్రస్తుతం కలబందను ఇండ్లలోనే పెంచుతున్నారు. దీంతో మనకు కలబంద ఎప్పుడు కావాలంటే అప్పుడు లభిస్తుంది. ఇక మార్కెట్‌లోనూ కలబంద జ్యూస్‌ను విక్రయిస్తున్నారు. దీన్ని కూడా మనం ఉపయోగించవచ్చు. అయితే కలబంద నిజంగా మనకు ఆరోగ్య ప్రదాయిని అనే చెప్పవచ్చు. కలబంద జ్యూస్‌ను తాగడం లేదా కలబంద గుజ్జును ఉపయోగించడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అందానికి, శిరోజాల సంరక్షణకు కూడా కలబంద ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే దీన్ని ఎలా తీసుకోవాలి అనే విషయం చాలా మందికి తెలియదు.

### ఇలా తీసుకోవాలి..

కలబంద గుజ్జు లేదా జ్యూస్‌ను నేరుగా అలాగే తీసుకోవచ్చు. అయితే కలబంద రుచి కొందరికి నచ్చకపోవచ్చు. ఇది కొందరికి చేదుగా, వగరుగా అనిపిస్తుంది. కనుక అలాంటి వారు తేనెను చేర్చి తీసుకోవచ్చు. అయితే కలబందను అలర్జీలు ఉన్నవారు తీసుకోకూడదు. కలబందను తింటే కొందరికి పడదు. దీంతో వారికి చర్మంపై దురదలు వస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక ఈ సమస్యలు ఎదుర్కొనే వారు కలబందను తినకూడదు. కలబందలో మన శరీరానికి ఉపయోగపడే అనేక ఔషధ గుణాలతోపాటు విటమిన్లు, మినరల్స్ కూడా ఉంటాయి. అందువల్ల కలబందను రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

### రోగ నిరోధక శక్తికి..

కలబందను రోజూ ఒక టీస్పూన్ మోతాదులో జెల్ తినవచ్చు. అదే జ్యూస్ అయితే రోజూ 30 ఎంఎల్ మోతాదులో తాగవచ్చు. కలబందలో విటమిన్లు ఎ, సి, ఇ, పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. కలబందలో ఉండే విటమిన్ ఎ మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తుంది. కలబందను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు పెరిగి కళ్లద్దాలను తీసి పడేస్తారు. ఇక కలబందలో ఉండే విటమిన్ సి మన శరీర ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

### శిరోజాలు, ముఖానికి..

కలబంద మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. కలబందను రోజూ తింటుంటే జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం తగ్గుతాయి. జీర్ణవ్యవస్థలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కలబంద శిరోజాలు, ముఖానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. దీంతో తయారు చేసే ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లను ఉపయోగించడం వల్ల ముఖం కాంతివంతంగా మారడమే కాదు, శిరోజాలు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఇలా కలబంద వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 02 - 09 - 2025

# లోన్ ఈఎంఐలు ఎంత తగ్గుతాయ్? ఆర్బీఐ ప్రకటన ప్రభావం ఎలా ఉంటుంది

పర్సనల్ ఫైనాన్స్, రెపో రేట్, ఈఎంఐ, లోన్ఫోటో

కీలక వడ్డీ రేట్ల సవరణ ప్రకటన సందర్భంగా పావు శాతం

వడ్డీని తగ్గిస్తున్నట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది.

ఇటీవల బడ్జెట్లో కూడా రూ.12 లక్షల వరకూ ఎలాంటి పన్నూ లేదని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

దీంతో ముఖ్యంగా ఉద్యోగస్తులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని చెబుతున్నారు.

మెల్లిగా చతికిలబడుతున్న ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు కేంద్రం ఈ డబుల్ బూస్టర్ డోస్ ఇచ్చినట్లుగా భావిస్తున్నారు.

పావు శాతం తగ్గింపు చిన్నగా అనిపించినప్పటికీ, ఇది ఇచ్చే మల్టిప్లయర్

ఎఫెక్ట్ మాత్రం దేశ ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా ఉంటుంది.

ఇకపై కూడా వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశాలు ఉన్న తరుణంలో రుణగ్రహీతలకు

ఎంతోకొంత మేలు కచ్చితంగా జరిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## వడ్డీ రేట్లు ఎందుకు తగ్గుతాయి?



ఆర్బీఐ గవర్నర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సంజీవ్ మల్హోత్రాకు ఇది మొదటి మానిటరీ పాలసీ కమిటీ మీటింగ్. ఈ సమావేశంలో ఆయన రెపో రేటును 6.50 నుంచి 6.25 శాతానికి తగ్గించినట్టు వెల్లడించారు.ఆర్థిక అవసరాల కోసం బ్యాంకులు ఆర్బీఐ దగ్గర తీసుకునే రుణానికి చెల్లించే రేటును రెపో రేటు అంటారు.ఇది చాలా కీలకమైన అంశం. ఇందులో హెచ్చుతగ్గులు బ్యాంకింగ్ రంగంపైన ప్రభావం చూపిస్తాయి. రెపో రేటు పెరిగినప్పుడల్లా వడ్డీ రేట్లు ఎలా పెరుగుతాయో, తగ్గినప్పుడు కూడా ఆ ప్రభావం వడ్డీ రేట్లపై ఉంటుంది.దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు, ద్రవ్యోల్బణం, బ్యాంకుల దగ్గర నగదు లిక్విడిటీ వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మానిటరీ పాలసీ కమిటీలో ఉండే ఆరుగురు సభ్యుల బృందం నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించే ఆర్బీఐ గవర్నర్ ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తారు.2023-24 ఆర్థిక ఏడాదిలో 8.2 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధి రేటు గత కొన్ని త్రైమాసికాల నుంచి మందగిస్తూ వచ్చింది. 2024-2025 ఏడాదిలో వృద్ధి రేటు కేవలం 6.4 శాతానికి మాత్రమే పరిమితం కావొచ్చనేది ప్రభుత్వ అంచనా. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి.ద్రవ్యోల్బణం కూడా పెరుగుతూ ఉండడంతో సామాన్యులకు ఊపిరాడని స్థితి నెలకొంది. దీంతో దేశీయంగా ప్రజల కొనుగోలు సామర్థ్యంలో కూడా అనూహ్య మార్పులు వచ్చాయి. ముఖ్యంగా మెట్రో నగరాలు, పట్టణాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతూ వస్తోంది. టూ వీలర్, ఫోర్ వీలర్ అమ్మకాలు, ఎఫ్ఎంసీజీ కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలు, కంపెనీల లాభదాయకత వంటివన్నీ మెల్లిగా ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉందనే సంకేతాలను ఇస్తూ వస్తున్నాయి.అందుకే కేంద్ర బడ్జెట్లో ఐటీ శ్లాబ్స్ రిలీఫ్ ప్రకటిస్తే, ఆర్బీఐ ఇప్పుడు వడ్డీ రేట్లలో కోత విధించడంతో ప్రభుత్వ నిర్ణయానికి తన వంతు మద్దతును అందించినట్లైంది.

### రూ.12 లక్షల వరకు మినహాయింపు మధ్య తరగతి

## ప్రజలకు ఎంత వరకు ప్రయోజనం?

ఈ సమయంలో, వారిపై భారం పడింది ఐదేళ్లుగా పెరుగుతూ వచ్చిన వడ్డీ రేట్లు ఇప్పుడు తగ్గుముఖం పట్టబోతున్నాయి. 2019 ఫిబ్రవరిలో 6.25 శాతంగా ఉన్న వడ్డీ రేట్లు మెల్లిగా తగ్గుతూ 2020 మే నెల నాటికి 4 శాతానికి చేరాయి. ఈ రెండు దశాబ్దాల్లో ఇదే అత్యంత కనిష్ఠ వడ్డీ రేటు.అప్పటి నుంచి పెరుగుతూ వచ్చి 2023 ఫిబ్రవరి నాటికి 6.5 శాతానికి చేరి, అక్కడే ఉండిపోయాయి. ఈరోజు ఆర్బీఐ వడ్డీ




రేట్లను మళ్లీ పావు శాతం తగ్గించి 6.25 శాతానికి తీసుకొచ్చింది. దీంతో ఐదేళ్లుగా ఉపశమనం కోసం ఎదురుచూస్తున్న వాళ్లకు ఇది ఊరటనిచ్చింది.2020 మార్చి నుంచి 2022 జూన్ మధ్య బ్యాంకులు కూడా విపరీతమైన స్థాయిలో రుణాలను ఇచ్చాయి. వడ్డీ రేట్లు తక్కువగా ఉండడంతో జనం కూడా హౌసింగ్ లోన్లు తీసుకున్నారు. ఇక అప్పటి నుంచి పెరుగుతూ వచ్చిన రుణాలతో ఈ టైమ్‌లో ఇళ్లు కొన్నవాళ్లపై తీవ్రమైన భారం పడిందని నిస్సందేహంగా చెప్పొచ్చు.ఉదాహరణకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో 2021 అక్టోబర్ - 2022 జూన్ మధ్యకాలంలో హౌసింగ్ లోన్ వడ్డీ రేటు 6.7 శాతంగా ఉండేది. ఆ తర్వాత పెరిగి ఇప్పుడు 9.2 శాతానికి చేరింది. నికరంగా 2.5 శాతం వడ్డీ రేట్ల పెంపుతో లోన్ తీసుకున్న వాళ్లపై తీవ్రమైన భారం పడింది.ఇరవై ఏళ్ల గరిష్ఠ టెన్యూర్ పెట్టుకున్న వాళ్లకు నెలనెలా రూ.5 వేల నుంచి రూ.6 వేల అదనపు భారం ఈఎంఐల రూపంలో పడింది.ఉదాహరణకు, రూ.50 లక్షల హౌసింగ్ లోన్‌ను 20 ఏళ్ల కాలపరిమితికి తీసుకుంటే.. వడ్డీ రేట్లు 7 నుంచి 9 శాతానికి పెరిగినప్పుడు ఎంత భారం పడిందో ఓ అంచనాగా ఇక్కడ చూడొచ్చు.

## హోమ్‌లోన్ వడ్డీ భారాన్ని తగ్గించుకోవడం ఎలా ?

## ఈఎంఐలు ఎంత తగ్గుతాయ్ ?

ఇప్పుడు హౌసింగ్ లోన్, పర్సనల్ లోన్ తీసుకున్న వాళ్లంతా ఆత్రుతగా ఎదురుచూసే అంశం తమ ఈఎంఐలపై పడే ప్రభావం.వడ్డీ రేటు తగ్గింది పావు శాతమే కదా అనుకోవచ్చు. కానీ, దీర్ఘ కాలంలో ఇది లక్షల రూపాయలను ఆదా చేస్తుంది. నెలవారీగా చూసుకుంటే రూ.600 నుంచి రూ.1200 వరకూ మాత్రమే తగ్గింది అనుకోవచ్చు. కానీ పదిహేనేళ్లు, ఇరవై ఏళ్ల కాలపరిమితి గల హౌసింగ్ లోన్ ఉన్నవాళ్లకు ఇది ఎంతో ప్రయోజనం కలిగించే అంశమే.20 ఏళ్ల పాటు చెల్లించే వడ్డీని కలిపి చూసుకుంటే ఆ ప్రభావం అర్థమవుతుంది.రూ.25 లక్షల గృహ రుణం తీసుకున్న వాళ్లకు సుమారు రూ.96 వేల వరకూ వాళ్ల టెన్యూర్‌లో కలిసొస్తుంది. అంటే, దాదాపు నాలుగైదు ఈఎంఐలు తగ్గినట్లే. (ఇవన్నీ ఫ్లోటింగ్ వడ్డీ రేటు ఆధారంగా చేసిన గణాంకాలు).

## వడ్డీ రేట్లు

ఆర్బీఐ నిర్ణయంతో హౌసింగ్ లోన్లతో పాటు పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్ ఈఎంఐలు కూడా తగ్గబోతున్నాయి.అయితే, ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గించిన తర్వాత బ్యాంకులు కూడా తగ్గిస్తేనే ఈ ప్రభావం



రుణగ్రహీతలపై ఉంటుంది. సాధారణంగా బ్యాంకులు రెపో రేటు ఆధారిత లోన్స్ ఇస్తుంటాయి కాబట్టి, తప్పనిసరిగా వడ్డీ రేట్లు తగ్గుతాయి.ఉదాహరణకు, ఆర్బీఐ రెపో రేట్ 6.75 శాతానికి, వాళ్ల మార్జిన్స్ 2.5 నుంచి 3.5 శాతం వరకూ జత చేర్చుకుని అడ్జస్టబుల్ హోమ్ లోన్ రేట్లుగా బ్యాంకులు చెబుతుంటాయి. ఇది ఫ్లోటింగ్ రేట్స్ వ్యవహారం. ఫిక్స్‌డ్ రేటును తీసుకుంటే రెండు, మూడేళ్ల పాటు ఇప్పుడున్న రేటు ఉంటుంది. తర్వాత మళ్లీ రెపో రేట్ ఆధారమైన అడ్జస్టబుల్ రేటుకే మారిపోతుందని గమనించాలి.ఇప్పుడు వడ్డీ రేట్లు తగ్గే సైకిల్ మళ్లీ మొదలైంది. మరో పావు శాతం లేదా అర శాతం వరకూ వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాలకు ఊతమివ్వాలంటే వడ్డీ రేట్లు తగ్గించక తప్పని స్థితి.ఒకవేళ వడ్డీ రేట్లు తగ్గిస్తే, ద్రవ్యోల్బణం కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. అయితే, ప్రస్తుతానికి వృద్ధి విషయంలో మాత్రమే ప్రభుత్వం దృష్టి సారిస్తోంది కాబట్టి ఆర్బీఐ ఆరు నెలల నుంచి ఏడాది కాలంలో మరో అర శాతం వరకూ గరిష్ఠంగా వడ్డీ రేట్లను తగ్గించవచ్చు.

## ఇప్పటికే లోన్ తీసుకున్నవాళ్లు ఏం చేయొచ్చు?

నెలవారీగా చెల్లించే ఈఎంఐ భారాన్ని తగ్గించుకోకుండా లోన్ కాల పరిమితి తగ్గించుకోండి. దీనివల్ల రుణం త్వరగా తీరిపోతుంది. అధిక శాతం మంది రూ.25 లక్షల నుంచి రూ.75 లక్షల వరకూ గరిష్ఠంగా రుణం పొందినవాళ్లే ఉంటారు. అందుకే నెలవారీ ఈఎంఐలో వందలు మిగుల్చుకునే బదులు, కాల పరిమితిని తగ్గించుకుంటే ఎక్కువ ప్రయోజనం పొందొచ్చు.బ్యాంకులను సంప్రదించి ఎంసీఎల్ఆర్ సైకిల్ ఆధారంగానే రేట్లు తగ్గాయా? లేదా ఏదైనా మార్పులకు అవకాశం ఉందా అనేది తెలుసుకోండి. మీ సిబిల్ స్కోర్ బాగుంటే వడ్డీ మరింత తగ్గుతుందేమో అడగండి.ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మెరుగైన ఆఫర్ ఇస్తే లోన్ బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ చేసుకోవడంపై ఆలోచించండి. ఇదే సమయంలో ప్రాసెసింగ్ ఫీజు సహా ఇతర ఖర్చులపై అవగాహన పెంచుకోండి.

## లోన్ కోసం చూస్తున్న వాళ్లు ఏం చేయొచ్చు?

హౌసింగ్ లోన్ కోసం బ్యాంకులతో ఎంక్వైరీలు మొదలుపెట్టొచ్చు. వడ్డీ రేట్లు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నాయి కాబట్టి ఫ్లోటింగ్ ఇంట్రస్ట్ రేట్‌తో లోన్ తీసుకోవడం మంచిది.

## ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లు తగ్గుతాయ్

వడ్డీ రేట్లు తగ్గడం అంటే, మనం తీసుకునే రుణాలపై మాత్రమే కాదు, మనం చేసే డిపాజిట్లపై కూడా తగ్గుతాయని గమనించాలి. అందుకే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా ఆర్బీఐ నిర్ణయం ప్రభావం చూపుతుంది. డిపాజిట్లపై కూడా వడ్డీ పావు నుంచి అరశాతం వరకూ తగ్గే అవకాశం ఉంది.ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలనుకునేవారు గరిష్ఠ వడ్డీ రేట్ల దగ్గర చేసి, వడ్డీ రేటును లాక్ చేసుకోవచ్చు. బ్యాంకులు ఏ రేటు దగ్గర డిపాజిట్ తీసుకుంటాయో దాన్ని టెన్యూర్ పూర్తయ్యేంతవరకూ కొనసాగించాల్సి ఉంటుంది.ఇన్వెస్ట్ చేసే ఆలోచన ఉన్న వాళ్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లు, కార్పొరేట్ బాండ్ల వంటివి పరిశీలించొచ్చు. ఏ పెట్టుబడిలో ఎంత రిస్క్ ఉంది, ఎంత ప్రయోజనం ఉంది అనే అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ బ్యాంకేతర సంస్థల్లో డిపాజిట్లు పెట్టేముందు మరింత జాగ్రత్తగా చెక్ చేసుకోవాలి.

# రూ.12 లక్షల వరకు మినహాయింపు మధ్య తరగతి ప్రజలకు ఎంత వరకు ప్రయోజనం?

12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండబోదని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ప్రకటించిన పన్ను నిబంధనల్లో మార్పులు మధ్య తరగతి ప్రజలకు కొంత ఊరట కల్పించాయని చెబుతున్నారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తన బడ్జెట్ ప్రసంగంలో ఆదాయపు పన్ను కొత్త శ్లాబ్‌లను ప్రకటించారు.ఇందులో 12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండబోదని ఆర్థిక మంత్రి ప్రకటించారు. జీతభత్యాలకు ఈ పరిమితిని రూ.12 లక్షల 75 వేలకు పెంచుతున్నట్లు చెప్పారు.



### మధ్య తరగతికి ఎంత ప్రయోజనం?

భారతదేశంలో మధ్య తరగతి అంటే వార్షిక ఆదాయం రూ. 5లక్షలు- 30 లక్షల వరకు (2020-21 ధరల ఆధారంగా) ఉన్న వారని అర్థం.పీపుల్స్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ ప్రకారం.. ప్రస్తుతం (2025) దేశ జనాభాలో 40 శాతం మంది



మధ్య తరగతిలో ఉన్నారు. 2016లో ఇది 26 శాతంగా ఉంది.భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం డిమాండ్ కొరతను ఎదుర్కొంటోంది. వస్తు, సేవలను ఎక్కువగా వినియోగించే మధ్యతరగతి వారి చేతిలో డబ్బులు లేకపోవడంతో కొనుగోలు శక్తి దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ తగ్గిపోయింది. వినియోగంలో తగ్గుదలతో కంపెనీలు ఉత్పత్తిని పెంచడం లేదు, కొత్త పెట్టుబడులు పెట్టడం లేదు. ఇది ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతోంది.2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధి రేటు 6.4 శాతం. గత నాలుగేళ్లలో ఇది అతి తక్కువ వృద్ధి. ఆర్థిక సర్వే 6.3 నుంచి 6.8 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది. దీనిని మందగమనానికి సంకేతంగా పరిగణిస్తున్నారు.2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (ఇది మోదీ ప్రభుత్వ లక్ష్యం) లక్ష్యాన్ని చేరుకోవాలంటే కనీసం 8 శాతం నిరంతర వృద్ధి అవసరం.

### ఆర్థిక వ్యవస్థకు ఎలా ప్రయోజనం?

మధ్యతరగతికి మరింతగా ఆదాయపు పన్ను మినహాయింపు ఇస్తే డిమాండ్ పెరుగుతుందని, ఇది ఆర్థిక వ్యవస్థను మళ్లీ వేగంగా కదిలించేలా చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.వినియోగదారులపై అధ్యయనం చేసే ఆర్థికవేత్త రాజేశ్ శుక్లా మాట్లాడుతూ.."దిగువ మధ్యతరగతి ప్రజలు ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పన్ను శ్లాబ్ ద్వారా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఏటా రూ.70 నుంచి 80 వేలు పొందడం పెద్ద విషయం. ఈ డబ్బు వినియోగానికి బదులుగా పొదుపులోకి వెళ్లినా మంచి ప్రయోజనమే. ఎందుకంటే ఆ పొదుపు అంతిమంగా వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది" అని అన్నారు."మధ్యతరగతి వారే వినియోగదారులు, ఉద్యోగులు, యజమానులు. డ్రైవర్లు, గృహ, ఇతర సహాయకుల సేవలనూ వారు తీసుకుంటారు. అందువల్ల, వారి చేతుల్లో ఆదా అయిన అదనపు డబ్బు ఈ సర్వీసులు అందించిన వారి దగ్గరికి వస్తుంది. తర్వాత ఈ డబ్బు మార్కెట్‌లోకి వస్తుంది. కాబట్టి, ఆదాయపు పన్నులో మరింత మినహాయింపు ఇచ్చే ప్రక్రియ మధ్యతరగతి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపశమనం కలిగిస్తుంది" అని రాజేశ్ శుక్లా అన్నారు.అయితే మధ్యతరగతి ప్రజల జేబులకు ఉపశమనం కలిగించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రభుత్వ వ్యూహాన్ని కొందరు నిపుణులు విమర్శిస్తున్నారు.మధ్యతరగతి ప్రజలకు ప్రత్యక్ష పన్ను మినహాయింపు ఇవ్వడం కంటే పరోక్ష పన్ను రేట్లను తగ్గిస్తే డిమాండ్‌ను పెంచడంలో చాలా ప్రభావవంతంగా ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో మాల్కం ఆదిశేషయ్య చైర్ ప్రొఫెసర్, ప్రముఖ ఆర్థికవేత్త అరుణ్ కుమార్ చెప్పారు.పేద వినియోగదారుడు కూడా పరోక్షంగా పన్ను చెల్లించాల్సి వస్తోందని ఆయన చెప్పారు. దేశంలో చాలా వస్తువులు, సేవలపై విధించే పరోక్ష పన్ను రేట్లు 28 శాతం వరకు ఉన్నాయన్నారు.అరుణ్ కుమార్ మాట్లాడుతూ "సుమారు 140 కోట్ల జనాభాలో 9.5 కోట్ల మంది మాత్రమే ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారు. వారిలో 6 కోట్ల మంది జీరో రిటర్న్‌లు దాఖలు చేస్తున్నారు. కాబట్టి కేవలం 3.5 కోట్ల మందికి మాత్రమే పన్ను మినహాయింపు మార్కెట్లో డిమాండ్‌ను అంతగా పెంచదు." అని అన్నారు."దిల్లీలో మధ్యతరగతి వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నందున మధ్యతరగతి వర్గాలకు ఆదాయపు పన్ను రాయితీ కల్పించే దిశగా ప్రభుత్వం ఇలా చేసింది" అని అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

### 'పరోక్ష పన్నులో ఉపశమనం ఇవ్వాలి'

దేశంలో జీఎస్టీ వసూళ్లు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అంటే పరోక్ష పన్నుల ద్వారా ప్రజల జేబుల నుంచి ప్రభుత్వానికి మరింత సొమ్ము చేరుకుంటోంది. 2023 డిసెంబర్‌తో పోలిస్తే 2024 డిసెంబర్‌లో 7.3 శాతం పెరిగి రూ.1.77 లక్షల కోట్లకు చేరుకుంది.జీఎస్టీ రూపంలో అధిక పరోక్ష పన్ను ప్రభావం సాధారణ వినియోగదారుల వినియోగ సామర్థ్యాన్ని తగ్గిస్తోందని నిపుణులు భావిస్తున్నారు. అంటే, పెరుగుతున్న ధరల కారణంగా వినియోగదారులు తక్కువ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.దేశంలో చాలా వినియోగ వస్తువులు, సేవలపై జీఎస్టీ రేటు 18 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఉంది. దీంతో ఈ వస్తువులు ఖరీదైనవిగా మారుతున్నాయి. నిత్యవసర వస్తువుల అమ్మకాలపై ప్రభావం పడుతోంది.ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పించే అవకాశం ఉన్న రంగాల్లో ప్రభుత్వం పెట్టుబడులను పెంచాలని అరుణ్ కుమార్ సూచిస్తున్నారు."వీటిలో గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి రంగాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి పెట్టుబడి పెట్టాలి. అప్పుడే ప్రజలకు డబ్బు అందుతుంది. సామాన్యుల చేతుల్లో ఆదా చేసిన ఈ డబ్బు మార్కెట్లోకి వచ్చి డిమాండ్‌ను పెంచుతుంది. ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుంది. మధ్యతరగతికి ఉపశమనం ఇవ్వడం వల్ల సమస్య పరిష్కారం కాదు" అని అరుణ్ కుమార్ వివరించారు.



# ఒక్క రోజే బ్రేక్.. మళ్లీ పైకి లేచిన పసిడి!



దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాట పట్టాయి. క్రితం రోజున పెరుగుదలకు బ్రేకిచ్చిన పసిడి ధరలు నేడు స్వల్పంగా పెరిగాయి. బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. నేటి బంగారం ధరలు ఏయే ప్రాంతాల్లో ఎలా ఉన్నాయనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

### తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 79,450, 24 క్యారెట్ల పసిడి రేటు రూ. 86,670 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.150, రూ.160 చొప్పున పెరిగాయి.

### ఇతర ప్రాంతాల్లో..

దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.86,820 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.79,960 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.160, రూ.150 చొప్పున పెరిగాయి.చెన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 79,450 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 86,670 వద్ద కొనసాగుతున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.150, రూ.160 చొప్పున పెరిగాయి. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి.

### వెండి ధరలు

దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు ఎలాంటి కదలిక లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ ధర రూ.1,07,000 వద్ద, ఢిల్లీలో రూ. 99,500 వద్ద నిలకడగా కొనసాగుతున్నాయి.

# ఎల్ఐసీకి మంచి లాభాలు.. ఎగిసిన రాబడి

బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్ డిసెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 11,056 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ. 9,444 కోట్లు మాత్రమే ఆర్జించింది. అయితే నికర ప్రీమియం ఆదాయం రూ. 1,17,017 కోట్ల నుంచి రూ. 1,06,891 కోట్లకు క్షీణించింది.ఈ బాటలో మొత్తం ఆదాయం సైతం రూ. 2,12,447 కోట్ల నుంచి రూ. 2,01,994 కోట్లకు వెనకడుగు వేసింది. నిర్వహణా వ్యయాలు రూ. 18,194 కోట్ల నుంచి రూ. 14,416 కోట్లకు తగ్గాయి. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 2024 డిసెంబర్‌కల్లా 10 శాతం బలపడి రూ. 54,77,651 కోట్లను తాకాయి. బీమా సఖి యోజన పథకంలో భాగంగా ఇప్పటివరకూ 1.25 లక్షల మంది మహిళలు రిజిస్టరైనట్లు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ వెల్లడించారు. బీమా సఖిగా 70,000 మంది ఎంపికైనట్లు తెలియజేశారు. ఫలితాల నేపథ్యంలో ఎల్ఐసీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 811 వద్ద ముగిసింది.

### ఫోర్టిస్ హెల్త్‌కేర్ లాభం జూమ్

దేశవ్యాప్తంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్న ఫోర్టిస్ హెల్త్‌కేర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయమైన పనితీరు చూపించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూసినప్పుడు 89 శాతం పెరిగి రూ.254 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.134 కోట్లుగా ఉండడం గమనార్హం. బెంగళూరులోని రిచ్‌మండ్ రోడ్ హాస్పిటల్‌ను విక్రయించడం రూపంలో వచ్చిన రూ.23.5 కోట్లు కూడా లాభాల్లో కలసి ఉన్నట్టు సంస్థ తెలిపింది.ఆదాయం ఇదే కాలంలో రూ.1,680 కోట్ల నుంచి రూ.1,928 కోట్లకు చేరింది. వ్యయాలు సైతం రూ.1,515 కోట్ల నుంచి రూ.1,696 కోట్లకు పెరిగిపోయాయి. "క్యూ3లోనూ సానుకూల పనితీరును కొనసాగించాం. మా కన్సాలిడేటెడ్ ఆదాయంలో ఆస్పత్రుల వ్యాపారం 84 శాతం సమకూర్చింది"అని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఎండీ, సీఈవో అశుతోష్ రఘువంశీ తెలిపారు. ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, కార్డియాక్ సైన్సెస్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆర్థోపెడిక్స్, రీనల్‌సైన్సెస్‌తో కూడిన స్పెషాలిటీ విభాగం నుంచే 62 శాతం ఆదాయం వచ్చినట్టు చెప్పారు. ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్ఈలో ఈ షేరు 0.8% నష్టపోయి రూ.646 వద్ద ముగిసింది.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
మంగళవారం 02 - 09 - 2025

## నాకు అలాంటి ఉద్దేశం లేదు..!

## హీరోయిన్ అంజలికి క్షమాపణలు చెప్పిన హీరో పవన్ సింగ్..!



భోజ్‌పురి సూపర్ స్టార్ పవన్ సింగ్ ఎట్టకేలకు దిగివచ్చాడు. ఇటీవల లక్నోలో జరిగిన స్టేజ్ షోలో అసభ్యంగా హీరోయిన్ నడుమును తాకిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో పలువురు హీరో అనుచిత ప్రవర్తనపై సర్వత్రా మండిపడ్డారు. ఈ ఘటన జరిగిన రెండురోజుల తర్వాత పవన్ సింగ్ మౌనం వీడాడు. హీరోయిన్ అంజలి రాఘవన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాడు. నటుడి అనుచిత ప్రవర్తనతో మనస్తాపానికి గురైన హీరోయిన్ అంజలి భోజ్‌పురి పరిశ్రమను వీడుతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్ట్‌లో పవన్ సింగ్ స్పందిస్తూ.. 'అంజలి జీ బిజీ షెడ్యూల్ కారణంగా నేను మీ లైవ్ చూడలేకపోయాను. ఈ విషయం నాకు తెలిసినప్పుడు నాకు చాలా బాధగా అనిపించింది. అందరం కళాకారులం కాబట్టి నాకు మీపై ఎలాంటి దురుద్దేశం లేదు. అయినప్పటికీ, నా ప్రవర్తతో మీరు బాధపడి ఉంటే దానికి నేను క్షమాపణలు కోరుతున్నాను' అని పేర్కొన్నారు. అయితే, హీరో పవన్ సింగ్ అంతకు ముందుకు ఓ పోస్ట్ చేశాడు. చేతులు ముడుచుకుని నిలబడి ఉన్న తన చిత్రాన్ని షేర్ చేశాడు. పోస్ట్‌తో పాటు 'ఏక్ కహానీ హై– జిస్ తన్ లగే సో తన్, కోయి నా జానే పీర్ పరాయీ' అని కాప్షన్ పెట్టాడు. లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో 'సైయాన్ సేవా కరే' పాట ప్రమోషన్ సందర్భంగా ఈ సంఘటన జరిగింది. 'సైయా సేవా కరే' పాట రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజలి దగ్గరకు హీరో పవన్ సింగ్ వచ్చాడు. ఆమె అనుమతి లేకుండా ఆమె నడుమును తాకాడు. చీరపై ట్యాగ్ ఉందని, దాన్ని తీసేందుకు అలా చేశానని పవన్ చెప్పినట్లు వీడియోలో వినిపించింది. ఆ క్షణంలో అంజలి నవ్వినప్పటికీ, ఆమె ముఖంలో అసౌకర్యానికి గురైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే, ఈ వ్యవహారంలో అంజలిని తప్పుపడుతూ పలువురు మీమ్స్ చేయడంతో మనస్తాపానికి గురైంది. బహిరంగంగా ఎవరో అనుమతి లేకుండా తాకితే దాన్ని ఎవరైనా ఆనందంగా స్వీకరిస్తారా? ఆ సమయంలో కొత్త చీర కావడంతో ట్యాగ్ ఉందేమోనని అనుకున్నాను. కానీ, ఆ తర్వాత ఏమీ లేదని తెలిసి కన్నీళ్లు ఆగలేదు. ఇదేందని నిలదీసేలోగానే పవన్ సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు' అంటూ చెప్పుకొచ్చింది. ఈ ఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అందుకే భోజ్‌పురి సినిమా ఇండస్ట్రీని పూర్తిగా వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఎవరి అనుమతి లేకుండా వారిని తాకడం ఎప్పటికీ సమంజసం కాదని.. ఇకపై తాను కుటుంబంతో కలిసి హర్యానాలోనే జీవిస్తానని చెప్పుకొచ్చింది. పలువురు అభిమానులు ఆమెకు మద్దతు ప్రకటించారు.




## ఉస్తాద్ భగత్ సింగ్ నుండి అదిరిపోయే పోస్టర్..

## ఇక జాతర మొదలు

మొన్నటి వరకు రాజకీయాలతో బిజీ బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ తాను కమిటైన ప్రాజెక్టలకి బ్రేక్ వేశాడు. ఇటీవల ఒక్కొక్కటి పూర్తి చేస్తూ దూసుకుపోతున్నాడు. హరిహర వీరమల్లు చిత్రం కొద్ది రోజుల క్రితం విడుదల కాగా, ఈ మూవీ అభిమానులని కూడా ఏ మాత్రం అలరించలేకపోయింది. ఇక ఓజీ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఏ ప్రాజెక్ట్ ప్రకటించినా అది అభిమానులకే కాదు, టాలీవుడ్ మొత్తానికి ఉత్సాహాన్ని కలిగిస్తుందన్న విషయంలో సందేహం లేదు. ఇప్పుడు అదే స్థాయిలో హైప్ తెచ్చుకుంటున్న సినిమా "ఉస్తాద్ భగత్ సింగ్". ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఒకప్పుడు గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన ఈ కాంబో మళ్లీ కలిసి వస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫ్యాన్స్ అయితే ఈ సినిమాను ఒక పండుగలా భావిస్తున్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఫ్యాన్స్ ముందుగానే పండుగను స్టార్ట్ చేశారు. కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్లడ్ డొనేషన్లు, సోషల్ సర్వీస్ కార్యక్రమాలు మొదలైపోయాయి. ఈ వేడుకలో మేకర్స్ కూడా భాగమవుతూ, ఒకటి తర్వాత ఒకటి సర్ప్రైజ్ గిఫ్ట్ ఇస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ ఈ జోష్‌కు మరింత బలాన్నిచ్చింది. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ ఒక సాంగ్ షూట్ లుక్‌లో కనిపించగా, ఆయన వింటేజ్ మాస్ స్టైల్, ఎనర్జీ ఫ్యాన్స్‌ను ఫుల్ ఖుషీ చేసింది.

ఈ లుక్‌లోని కాస్ట్యూమ్, పవన్ బాడీ లాంగ్వేజ్ అంతా అభిమానుల్లో ఫుల్ జోష్ కలిగిస్తుంది. సోమవారం సాయంత్రం 4:45 గంటలకు మేకర్స్ "ఫుల్ మీల్స్" అంటూ హైప్ క్రియేట్ చేయడం చూస్తుంటే, ఈ మూవీ కూడా సూపర్ డూపర్ హిట్ కావడం ఖాయం అంటున్నారు. హరీష్ శంకర్ %–% పవన్ కలయిక అంటేనే ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. "గబ్బర్ సింగ్"లో ఆయన పవన్ మాస్ ఇమేజ్‌ని ఎలా వాడుకున్నారో అందరికీ గుర్తే. ఇప్పుడు మళ్లీ అదే డైరెక్టర్ చేతిలో పవన్ పడడంతో ఈ సినిమా ఫుల్ మాస్ ఎంటర్టైనర్గా వస్తుందన్న ఆశలు పెరిగిపోయాయి. సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్, యాక్షన్ సీక్వెన్సుల విషయంలో మేకర్స్ భారీగా ఖర్చు చేస్తున్నారని సమాచారం. పవన్ కళ్యాణ్ స్టామినాకు తగ్గ రీతిలో గ్రాండ్ విజువల్స్ చూపించేందుకు అన్ని విభాగాలూ జాగ్రత్తలు తీసుకుంటున్నాయట. "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమా పవన్ అభిమానుల కోసం ఒక ఫుల్ మాస్ ఫెస్టివల్‌గా మారుతోంది.

## దుబాయ్ బిజినెస్‌మెన్ ప్రేమలో ఈ యంగ్ బ్యూటీ!



టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ రీసెంట్‌గా తన ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్‌తో రిలేషన్‌లో ఉన్నానని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ ప్రకటన అనంతరం సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే నివేదా తాజాగా తన ప్రేమాయణంకి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఐదేళ్ల క్రితం దుబాయ్‌లో నిర్వహించిన ఓ రేసింగ్ ఈవెంట్‌లో రజిత్‌ను మొదటిసారి కలిశాను. మొదట మేము మంచి స్నేహితులుగా ప్రారంభించాము. ఆపై సమయం గడుస్తూ అభిప్రాయాలు కలవడం, మనసులు దగ్గర కావడంతో ప్రేమలో పడిపోయాము. మా రిలేషన్ గురించి చాలా తక్కువ మందికే తెలుసు. ఇండస్ట్రీలో కూడా ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఈ విషయాన్ని బయటపెట్టడంతో నా మేనేజర్ కూడా షాక్ అయ్యాడు అని చెప్పింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మేం ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నాం. పెళ్లి జనవరిలో ప్లాన్ చేస్తున్నాం. తుది తేదీ ఇంకా ఫిక్స్ కాలేదు కానీ, పెళ్లి పనులు మొదలుపెట్టేశాం. మా ఇరు కుటుంబాలు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాయి. మేము సింపుల్‌గా, కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లిని జరుపుకుంటాం అని నివేదా వివరించింది. మధురైలో జన్మించి పెరిగిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. అనంతరం 'చిత్రలహరి', 'బ్రోచేవారేవరురా', 'అల వైకుంఠపురములో', 'రెడ్', 'పాగల్', 'విరాటపర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి సినిమాల్లో నటించింది. సినిమాల పరంగా టాలెంట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త ప్రాజెక్టులు లేనట్లు తెలుస్తోంది. కార్ రేసింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లోనూ ఆమె ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంది. ఇకపై ఆమె వ్యక్తిగత జీవితం కొత్త అధ్యాయానికి తెరలేవనుంది. పెళ్లి తర్వాత నివేదా సినిమాలు చేస్తుందా లేదా అనేది చూడాలి.




## వరుణ్ సందేశ్ 'కానిస్టేబుల్' మూవీ ట్రైలర్ రిలీజ్

వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటించిన సినిమా 'కానిస్టేబుల్'. ఆర్యన్ సుభాన్ దర్శకత్వం వహించగా బలగం జగదీష్ నిర్మించారు. థ్రిల్లర్ కథతో తీసిన ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్ లాంచ్ చేశారు. ఇప్పటివరకు లవర్ బాయ్‌గా నాకు పేరుంది. సినిమాతో పాటు నా పాత్ర కూడా బాగా వచ్చిందని మూవీ టీం చెప్పడంతో చాలా సంతోషం అనిపించింది. తప్పకుండా మా అంచనాలని 'కానిస్టేబుల్' నిలబెడుతుందని అనుకుంటున్నానని వరుణ్ సందేశ్ చెప్పుకొచ్చాడు. మా అందరి కెరీర్ మలుపుతిప్పే చిత్రం ఇది అవుతుంది. వరుణ్ సందేశ్‌కి కూడా కమ్ బ్యాక్ ఇస్తుందని దర్శకుడు ఆర్యన్ సుభాన్ అన్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332